



పండుగ శోభ!

విద్యుద్దీప కాంతుల్లో బారాషహీద్ దర్గా

సుదూర ప్రాంతాల నుంచి భక్తుల రాక

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 13 : మత సామరస్యానికి ప్రతీక, కోరిన కోర్కెలు తీర్చే రొట్టెల పండుగ కోసం బారాషహీద్ దర్గా మైదానం, స్వర్ణాల చెరువు ఘాట్‌లు ముస్తాబవుతున్నాయి. శనివారం రాత్రి దర్గాతోపాటు పరిసర ప్రాంగణాల్లో విద్యుద్దీపాలు వెలిగించడంతో నూతన శోభను సంతరించుకున్నాయి. ఈ నెల 17వ తేదీన ప్రారంభమయ్యే పండుగ 21 వరకు జరగనుంది. ప్రతి సంవత్సరం ఆనవాయితీ ప్రకారం పండుగ ప్రారంభానికి ముందే భక్తులు దర్గాకు తరలి వస్తున్నారు. కర్నాటక, తమిళనాడు రాష్ట్రాలతో పాటు నాగ్‌పూర్, అనంతపురం, కడప తదితర సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటున్నారు. స్వర్ణాల చెరువులో స్నానమాచరిచి వరాల రొట్టెలను మార్చుకుంటున్నారు. అలాగే బారా షహీద్‌లను దర్శించుకుని పూజలు చేశారు. తరలివస్తున్న భక్తుల కు ఎలాంటి లోటు కలగకుండా ఉత్సవ కమిటీ చైర్మన్ షేక్.ఖాదర్‌బాషా, సభ్యు లు పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం నుంచే భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.



స్వర్ణాల చెరువులో రొట్టెలు మార్చుకుంటున్న భక్తులు

● ఎస్పీ పరిశీలన

నెల్లూరు (క్రైం) : దర్గా పరిసరాలను ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్ శనివారం పరిశీలిం చారు. పండుగ ఏర్పాట్లను పరిశీలించి, పోలీసు అధికా రులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుత రద్దీకి తగ్గట్లుగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏఎస్పీలు, డీఎస్పీలు డీఎస్పీ వెంట ఉన్నారు.

జిల్లా పోలీసు బాస్‌గా కృష్ణకాంత్

- **2017లో ఐపీఎస్‌కి ఎంపిక**
- **డీజీపీ కార్యాలయానికి ఆరీఫ్ హాఫీజ్ బదిలీ**



నూతన ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు (క్రైం), జూలై 13 : జిల్లా పోలీస్ బాస్‌గా జీ కృష్ణకాంత్‌ను నియమిస్తూ శనివారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత ఎస్పీ కే ఆరీఫ్ హాఫీజ్ డీజీపీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కర్నూలు ఎస్పీగా పనిచేస్తున్న జీ కృష్ణకాంత్‌ను నియమించారు. అనంతపురం జిల్లా గుత్తి మండలం ఎస్ఎస్ పల్లికి చెందిన జి కృష్ణకాంత్ అనంతపురం సీఎంఐ కళాశాలలో బీఎస్సీ బయోటెక్నాలజీ, హర్యానాలోని ఎన్‌డీఆర్ కర్నల్ యూనివర్సిటీలో ఎంఎస్సీ బయోటెక్నాలజీ పూర్తి చేశారు. కృష్ణకాంత్ తండ్రి రామాంజనేయులు ఇండియన్ రైల్వేలో ఉద్యోగిగా చేసి పదవీ విరమణ పొందగా తల్లి రామతులసి గృహిణి. భార్య ప్రవీణ వైద్య విద్యను అభ్యసించి గృహిణిగా ఉన్నారు. 2017లో సివిల్స్‌లో ఐపీఎస్‌గా ఎంపికైన కృష్ణకాంత్ గ్రేహౌండ్స్‌లో అసిస్టెంట్ కమాండర్‌గా, తూర్పుగోదావరి జిల్లా చింతూరు అదనపు ఎస్పీగా, అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరంలో ఓఎస్‌డీగా కృష్ణకాంత్ విధులు నిర్వహించారు. 2023, ఏప్రిల్‌లో కర్నూలు జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. విధులు నిర్వహించిన ప్రతిచోట మంచి అధికారిగా కృష్ణకాంత్ పేరు తెచ్చుకున్నారు. నేరాల నియంత్రణ, సైబర్ క్రైం కట్టడిలో ప్రత్యేక ముద్ర వేసుకున్నారు.

● ఎన్నికల నిర్వహణలో...

జిల్లాపై పెద్దగా పట్టు లేదు. గతంలో పని చేసిన అనుభవమూ లేదు. అయినా ఎన్నికల నిర్వహణలోను, శాంతి భద్రతల పర్యవేక్షణలోనూ ప్రస్తుత ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్ తనదైన ముద్ర వేసుకున్నారు. ఈ ఏడాది 4న బాధ్యతలు చేపట్టిన ఆయన మొదటి రోజు నుంచే చాలెంజ్‌గా విధులు నిర్వహిస్తూ ప్రణాళికాబద్ధంగా ఎన్నికల విధులు నిర్వహించారు. అయితే, జిల్లాలో హత్యలు, హత్యాయత్నాలు, దొంగతనాలు, దోపిడీలు, రౌడీయిజాన్ని అదుపు చేయడంలో మాత్రం ప్రత్యేక మార్క్ చూపలేక పోయారన్న విమర్శలను ఆరీఫ్ హాఫీజ్ మూటగట్టుకున్నారు.





అమాత్యా.. ఆలకించు!

- ఇరిగేషన్ ప్రాజెక్టులను గాలికొదిలేసిన వైసీపీ సర్కారు
- దెబ్బతిన్న ఆఫ్రాన్.. ప్రమాదంలో సోమశిల
- బిల్లుల సమస్యతో ఆగిన ప్రధాన ప్రాజెక్టులు
- కూటమి ప్రభుత్వంపైనే అన్నదాతల ఆశలు
- నేడు జిల్లాలో ఇరిగేషన్ మంత్రి పర్యటన

నెల్లూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ ఆధార మైన జిల్లాలో ఇరిగేషన్ శాఖను వైసీపీ ప్రభుత్వం భ్రష్టుపట్టిం చింది. జీవనాడి వంటి సోమశిలను అత్యంత ప్రమాదంలోకి నెట్టింది. బిల్లులు ఇవ్వక ప్రధాన ప్రాజెక్టులను అటకెక్కించింది. చివరకు పిల్ల కాలువల్లో కూడా పూడిక తీయకుండా రైతాంగంతో ఆటలాడుకుంది. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో కొత్తగా ఒక్క ఎకరాను కూడా సాగులోకి తీసుకురాలేక పోయారు. 90 శాతం పూర్తయిన నెల్లూరు, పెన్నా బ్యారేజీలను పూర్తి చేయకుండానే చేసినట్లుగా హడావిడిగా ప్రారంభించడం తప్ప చేసిందేమీ లేదు. ఆఖరుకు ఆ బ్యారేజీలను నిర్వహించేం దుకు ఒక్క మనిషినీ నియమించలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలోని ఎమ్మెల్యేలందరూ ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో జిల్లా ఇరిగేషన్ శాఖపై చర్చించారు. జిల్లాకు వచ్చి కీలక ప్రాజెక్టులను సందర్శించి ఇరిగేషన్ శాఖను గాడిలో పెట్టేందుకు సహకరించాలని కోరారు. ఆ క్రమంలో నిమ్మల రామానాయుడు ఆదివారం నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నారు. ప్రధానమైన సోమశిల, కండలేరు ప్రాజెక్టులను సందర్శించడంతోపాటు ఇరిగేషన్ అధికారులతో సమీక్షించనున్నారు. దీంతో రైతాంగం ఆశలన్నీ నిమ్మలపైనే పెట్టుకున్నాయి. ప్రధాన ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయడమే కాకుండా సీజన్ సమీపిస్తుండటంతో అత్యవసరంగా పంట కాలువల్లో పూడిక తీసేలా చర్యలు తీసుకోవాలంటూ విజ్ఞప్తి చేస్తున్నారు.

● ప్రమాదంలో సోమశిల

2020, 2021లో పెన్నాకు వచ్చిన వరదలకు సోమశిల ఆఫ్రాన్ పూర్తిగా దెబ్బతిన్నది. ప్రాజెక్టు ముందుభాగంలో ఉండే కాంక్రీట్ కొట్టుకుపోయింది. దీంతో మరోమారు భారీ వరద వస్తే సోమశిల జలాశయం తీవ్ర ప్రమాదంలో పడుతుందని నిపుణుల కమిటీ తేల్చింది. ఈ మేరకు ఆఫ్రాన్‌ను పరిశీలించి అత్యవసరంగా పునఃనిర్మాణ పనులు చేపట్టాలని ప్రభుత్వానికి సూచించింది. దీంతో రూ.100 కోట్లతో ఆఫ్రాన్ పనులు మొదలు పెట్టారు. సుమారు రూ.20 కోట్ల పనులు కూడా జరిగాయి. కానీ కాంట్రాక్టర్‌కు ఒక్క రూపాయి కూడా బిల్లు ఇవ్వకపోవడంతో రెండేళ్ల నుంచి పనులు నిలిపేశారు. గతేడాది వరదలు రాలేదు కాబట్టి బతికిపోయాం కానీ ఈ దఫా వరదలు వస్తే పరిస్థితి ఊహించేందుకు కూడా కష్టంగా ఉంటుందని ఇంజనీర్లే చెబుతుండటం గమనార్హం. సోమశిల ఆఫ్రాన్ పనులను అత్యవసరం చేపట్టాల్సి ఉంది.

● పగలగొట్టారు.. ఆపేశారు

ప్రధానమైన సోమశిల-కండలేరు వరద ప్రవాహ కాలువ (ఎస్‌కేఎఫ్ఎఫ్), సోమశిల ఉత్తర కాలువ(జీకేఎన్ కెనాల్)లను విస్తరించేందుకు మూడేళ్ల క్రితం రూ.1300 కోట్లతో పనులు మొదలుపెట్టారు. చాలా వరకు ఈ కాలువల లైనింగ్‌ను పగలగొట్టారు. కానీ ప్రభుత్వం బిల్లులు ఇవ్వలేదన్న కారణంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. ఇది తీవ్ర ఇబ్బందిగా మారింది. సోమశిల నుంచి కండలేరుకు నీటిని తరలించాలన్నా, సోమశిల నుంచి ఆత్మకూరు, ఉదయగిరి మెట్ట ప్రాంతాలకు నీటిని సరఫరా చేయాలన్నా ఎస్‌కేఎఫ్ఎఫ్, జీకేఎన్ కాలువలు చాలా ప్రధానమైనవి. ఈ కాలువల విస్తరణ పనులను త్వరగా మొదలుపెట్టాల్సిన అవసరముంది.

అటకెక్కిన బండేపల్లి- దేగపూడి

కనుపూరు కాలువ టెయిలెండ్ అయిన మనుబోలు మండలం లోని ఆయకట్టు ఏటా చివరి తడి సమయంలో ఎండిపోతోంది. ఈ సమస్యను పరిష్కరించాలంటే కండలేరు వాగు నుంచి ప్రత్యేక కాలువను బండేపల్లి కాలువకు కలుపడమేనని ఇంజనీర్లు నిర్ధారించారు. దీంతో బండేపల్లి- దేగపూడి కాలువ నిర్మాణాన్ని చేపట్టాలని మనుబోలు, పొదల కూరు ప్రాంత రైతులు పాతికేళ్ల నుంచి కోరుతూ వస్తున్నారు. 2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలో రూ.24 కోట్లతో అత్యవసరమైన ఈ కాలువ పనులు మొదలయ్యాయి. కొద్ది దూరం కాలువను కూడా తవ్వారు. కానీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పనులు ఆగిపోయాయి. ఇది పూర్తయితే 25 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుంది. అత్యంత ప్రాధాన్యతా ప్రాజెక్టుల్లో ఈ కాలువ కూడా ఉంది.

మంత్రి పర్యటన ఇలా..

నెల్లూరు (హరనాథపురం) : రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, దేవదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి, పురపాలక శాఖ మంత్రి నారాయణలు ఆదివారం ఉదయం 10.45 గంటలకు సోమశిల రిజర్వాయర్‌ను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటలకు కండలేరు రిజర్వాయర్‌ను తనిఖీ చేస్తారు. అనంతరం అక్కడే ఇరిగేషన్ అధికారులతో జలవనరుల శాఖపై అధికారులతో సమీక్షిస్తారు. సాయంత్రం 4.45 గంటలకు నెల్లూరులోని ఆర్అండ్‌బీ అతిథిగృహానికి చేరుకుంటారు.

● గేట్లు ఎత్తేవారు లేరు

అత్యంత కీలకమైన సంగం, నెల్లూరు బ్యారేజీలను పుష్కరకాలంపాటు శ్రమించి ఎలాగోలా పూర్తి చేశారు. ఈ రెండు ప్రాజెక్టులకు దాదాపు రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేశారు. గత ప్రభుత్వంలో పనులు పూర్తి కాకుండానే వీటిని ప్రారంభించారు. కానీ ఆ తర్వాత ఈ బ్యారేజీల నిర్వహణను పట్టించుకోలేదు. కాంట్రాక్టర్ల లయబుల్ పీరియడ్ కూడా ముగిసింది. ఇప్పుడు ఆ రెండు బ్యారేజీల వద్ద గేట్లు ఎత్తేందుకు ఒక్కరు కూడా లేరు. ఇప్పుడు భారీ వరదలు వస్తే ఆ రెండు బ్యారేజీలు ప్రమాదంలో పడతాయి. ఈ బ్యారేజీల వద్ద పనిచేయడానికి సుమారు 60 మంది వరకు అవసరమవుతారని ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు పంపినా గత ప్రభుత్వం అనుమతులివ్వలేదు.

● ప్రక్షాళన అవసరం

జిల్లాలో ఇరిగేషన్ శాఖ పనితీరు అత్యంత దారుణంగా మారిపోయింది. గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు ఈ శాఖను ఒక బంగారు బాతులా భావించారు తప్ప రైతులకు సేవ చేయలేదు. రూ.వందల కోట్లు నిధులు తీసుకొచ్చి పనులు చేయకుండానే బిల్లులు తినేశారు. ఇరిగేషన్ శాఖ అధికారులు కూడా వారితో జతకలిశారు. ఈ అక్రమాలపై విచారించాలంటూ ప్రస్తుత ఎమ్మెల్యేలు పట్టుబడుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం రెగ్యులర్, సోమశిల, టీజీపీ ప్రాజెక్టులు మూడింటికీ ఎస్ఈలు ఇన్‌చార్జ్‌లే కావడం గమనార్హం. వీరేకాదు అనేక ఈఈలు, డీఈఈలు పోస్టులు కూడా ఇన్‌చార్జ్‌ల పాలనలో మగ్గుతున్నాయి. జీతం తీసుకునేది ఓ చోట.. పని చేసేది మరో చోటగా ఇక్కడ అధికారుల పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ శాఖను పూర్తిగా ప్రక్షాళన చేయాల్సిన అవసరముంది.

కోడూరుపాడు ప్రభుత్వ భూములపై
కదులుతున్న డొంక

- బోర్డులు పెట్టినవారే 22-ఏ జాబితాలో తొలగింపునకు ప్రతిపాదనలు
- భారీగా నగదు చేతులు మారినట్లు ఆరోపణలు
- విచారణకు ఆదేశించిన కలెక్టర్ ఆనంద్

నెల్లూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : 'ఆంధ్రజ్యోతి'లో శనివారం ప్రచురితమైన 'ఎవరు చేశారు.. ఎందుకు చేశారు!?' కథనం రెవెన్యూ శాఖలో పెద్ద కుదుపునే తెచ్చింది. నిషేధిత జాబితాలో ఉండాల్సిన రూ.100 కోట్ల విలువైన 21 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎవరు తొలగించారన్నదానిపై తీవ్ర చర్చ నడుస్తోంది. తీగలాగితే డొంక కదిలినట్లుగా గతంలో జరిగిన వ్యవహారాలన్నీ వెలుగులోకి వస్తున్నాయి. నెల్లూరు రూరల్ మండలం గుడిపల్లిపాడు రెవెన్యూ పరిధిలోని కోడూరుపాడు వద్ద సర్వే నెంబర్లు 521, 525, 527, 529-ఏలలోని 21 ఎకరాల ప్రభుత్వ భూమిపై కలెక్టర్ ఓ ఆనంద్ విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. వెంటనే పూర్తిస్థాయి నివేదికను అందజేయాలని ఆర్‌డీవో, తహసీల్దార్లకు సూచించినట్లు సమాచారం. ఈ క్రమంలో కొన్ని విషయాలు చర్చనీయాంశంగా మారాయి.

2024లోనే బీజం..

2004లో అప్పటి కలెక్టర్, తహసీల్దార్లు హైకోర్టులో పిటిషన్ వేసి ప్రభుత్వ భూమి పరులపాలు కాకుండా అడ్డుకోగలిగారు. అవతలిపార్టీ సుప్రీంకోర్టుకు వెళ్లినా అధికారులు పోరాడుతూ వస్తున్నారు. 2021లో చుట్టూ ఉన్న పట్టా భూమిలో లేఅవుట్ వేస్తున్న వ్యక్తులు, ఈ ప్రభుత్వ భూమిని కూడా ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని కొందరు హైకోర్టును ఆశ్రయించారు. ఆ క్రమంలో అప్పటి కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు స్వయంగా తన పేరుతో 2021 డిసెంబరులో హైకోర్టుకు కౌంటర్ వేశారు. అయితే 2023 జనవరిలో వచ్చిన నిషేధిత భూముల తొలగింపు జాబితాలో ఈ ప్రభుత్వ భూములు కూడా ఉన్నాయి. అప్పటికీ ఆయనే కలెక్టర్‌గా ఉండటం గమనార్హం. ఇక 2023 ఏప్రిల్‌లో మారోమారు ఈ భూములను ఆక్రమిస్తున్నారంటూ ఫిర్యాదులు అందడంతో స్వయంగా అప్పటి జేసీ రోణంకి కూర్మనాథ్ విచారణకు వెళ్లారు. పూర్తిస్థాయి నివేదిక తెప్పించుకొని ఆ భూములు ఆక్రమణకు గురికాకుండా చూస్తామని ప్రకటించారు. మరి అప్పుడు ఆయన దృష్టికి ప్రభుత్వ భూములను 22-ఏ నుంచి తొలగించిన విషయం వెళ్లలేదా? అన్న చర్చ నడుస్తోంది. నెల్లూరు రూరల్ మండలంలో 2021లో ఉన్న అధికారులే 2023లో కూడా ఉన్నారు. మరి వారు కూడా ఎందుకు ఈ విషయాన్ని పట్టించుకోలేదన్న అనుమానాలు కలుగుతున్నాయి. నిషేధిత జాబితాలో తొలగింపునకు మొదట తహసీల్దార్లు ప్రతిపాదనలు పంపగా, ఆర్‌డీవో పరిశీలించి కలెక్టరేట్‌కు పంపారు. అక్కడ జేసీ, కలెక్టర్‌లు పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు. అక్కడి నుంచి తొలగింపు జాబితా విడుదలైంది. ఇలా ప్రతిపాదనలు పెట్టే సమయంలోనే అధికారు లెవరూ పట్టించుకోక పోవడం అనేక అనుమానాలను రేకెత్తిస్తోంది. ఈ వ్యవహారం వెనుక భారీగా చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ భూముల్లో నాటిని హెచ్చరిక బోర్డులు కూడా మాయమైపోవడం గమనార్హం.



ఉదయగిరి : ఆక్రమిత భూముల్లో రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దారు


● ప్రభుత్వ భూముల పరిశీలన

ఉదయగిరి : మండలంలోని కొండాయపాళెం మజారా ప్రభుత్వ భూముల్లో బినామీ పట్టాలు పొందిన వారిపై చర్యలు తప్పవని తహసీల్దారు నెహ్రూబాబు అన్నారు. శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'భూముల్లో బినామీల పాగా' కథనంపై ఆయన స్పందించారు. ఆత్మకూరు ఆర్డీవో మధులత ఆదేశాల మేరకు ప్రభుత్వ భూములను పరిశీలించారు. సర్వే నెంబర్ల ప్రకారం ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి తక్షణమే నివేదికలు తయారు చేయాలని వీఆర్వో వెంకట్, సర్వేయర్ మీరావలికి సూచించారు. నివేదికలను ఆర్డీవో, జిల్లా కలెక్టర్‌కు పంపనున్నట్లు పేర్కొన్నారు.

సమగ్ర సోమశిలకు సహకరించండి!

అనంతసాగరం : సోమశిల జలాశయ అభివృద్ధిని గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. సమగ్ర సోమశిల దిశగా అడుగులు ముందుకు పడలేదు. అత్యవసరంగా చేయాల్సిన పనులు సైతం విస్మరించి జలాశయం పటిష్టతను గాలికి వదిలిశారు. ఈ తరుణంలో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వంపై జిల్లావాసులు ఆశలు పెంచుకొన్నారు.

ప్రధాన సమస్యలివీ..



- జలాశయం వద్ద సిబ్బంది కొరత ఉంది. దీంతో ఉన్నవారిపై పనిభారం పెరిగి ఇబ్బందులు పడుతున్నారు.
- క్రస్ట్‌గేట్ల వ్యవస్థ సరిగా లేదు. 2021, 22లో సోమశిలకు భారీ వరద రాగా కొన్ని గేట్లు మొరాయించడంతో ఇబ్బంది పడ్డారు. గేట్ల వ్యవస్థను ఆధునీకరించాలి. లీకేజీలు లేకుండా పనులు చేపట్టాలి.
- ఎగువ నుంచి డ్యాంకు వరద వచ్చే సమయంలో నైపుణ్యం కలిగిన సిబ్బంది లేక గేట్లు ఎత్తడం.. దించడంలో అవస్థలు తప్పడం లేదు. టెక్నికల్ సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉంది.
- 2013లో ఏర్పాటు చేసిన టూరిజం భవనాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వసతులు కరువై పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు.
- ప్రముఖ సోమేశ్వరుడి ఆలయం వరదలకు ధ్వంసమౌ రెండేళ్లు పూర్తవుతున్నా ఇంతవరకు ఎలాంటి అభివృద్ధి లేదు.
- జలాశయ పరిసరాల్లో అధ్వానంగా ఉన్న రహదారులను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేయాల్సి ఉంది.
- రాళ్ల వ్యర్థాలతో డ్యాం పరిసరాలు కళావిహీనంగా ఉంది. ఖాళీ ప్రదేశాలలో పచ్చదనం పెంపొందించి పార్కుల అభివృద్ధి చేస్తే బాగుంటుంది.
- తెలుగు గంగ కాలువ గేట్లనూ ఆధునికీకరించాల్సి ఉంది.
- తెలుగుగంగ రక్షణ గోడల ద్వారా నీరు లీకవుతుంది. కాలువ గోడలను పటిష్ట పరచాల్సి ఉంది.
- స్టాప్‌లాగ్ గేట్లతోపాటు విద్యుత్ వ్యవస్థను మెరుగు పరచాల్సి ఉంది.
- డ్యాం వద్ద బోటు షికారు కలగా మారింది. గతంలో ప్రతిపాదనలు జరిగినా కార్యరూపం దాల్చలేదు.
- డ్యాం ముందు దెబ్బతిన్న పొర్లుకట్టలను అభివృద్ధి చేయాల.
- ఆనం సంజీవరెడ్డి హైలెవల్ కెనాల్ అభివృద్ధి పనులు కూనరిల్లుతున్నాయి. మెట్ట గ్రామాల్లో నీటి ఇబ్బందులతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. హైలెవల్ త్వరగా పూర్తి చేయాలి.

వెంకటేశ్వరపురం వద్ద కుంగిన ఫ్లైఓవర్ బ్రిడ్జి



కుంగిన ఫ్లైఓవర్ బ్రిడ్జి

- ముంబయి హైవేపై వెళ్లే వాహనాలకు బ్రేక్
- కోవూరు,ఇనమడుగు మీదుగా మళ్లింపు
- రొట్టెల పండుగ నేపథ్యంలో తాత్కాలిక మరమ్మతులు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), జూలై 13 : నగరంలోని వెంకటేశ్వరపురం వద్దనున్న ఫ్లైఓవర్ బ్రిడ్జ్‌లో కొంతభాగం పూర్తిగా కుంగిపోయింది. దీంతో ముంబయి జాతీయ రహదారివైపు వెళ్లే వాహనాలను ట్రాఫిక్ పోలీసులు పూర్తిగా నిలిపివేశారు. రైల్వేవంతె నకు రోడ్డు వంతెనకు మధ్య కొంతకాలం క్రితం గుంత ఏర్పడింది. ఇదే ప్రాంతంలో శనివారం ఉదయం భారీ గుంత ఏర్పడింది. విషయం తెలుసుకొన్న ట్రాఫిక్ పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని వాహన రాకపోకలను పూర్తిగా ఆపివేశారు. నేషనల్ హైవే అథారిటీ (ఎన్‌హెచ్ఏ) అధికారులు, రైల్వే అధికారులు కుంగిన ప్రాంతాన్ని పరిశీలించారు. అయితే, ఈ నెల 17న రొట్టెల పండుగ జరగనున్న నేపథ్యంలో దెబ్బ తిన్న బ్రిడ్జికి తాత్కాలిక మరమ్మతులు చేయలని, పండుగ తరువాత శాశ్వత మరమ్మతులు చేపట్టాలని జిల్లా మంత్రులు, కలెక్టర్ నిర్ణయించారు. ఈ మేరకు ఎన్‌హెచ్ఏ పీడీ యంకే చౌదరి కుంగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఆదివారం నుంచి తాత్కాలిక మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. అయితే శాశ్వత మరమ్మతు పనులు చేయాలంటే దాదాపు 2 నుంచి 3 నెలలు సమయం పట్టనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.



కుంగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎన్‌హెచ్‌వో పీడీ ఎంఎన్ చౌదరి

● రాకపోకల మళ్లింపు

ముంబయి జాతీయ రహదారి వంతెన కావడంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఒక్కసారిగా బ్రిడ్జిని మూసివేయడంతో వాహనాల రాకపోకలను కోవూరు, ఇనమడుగు వైపు మళ్లించారు. కేవలం చిన్నవాహనాలనే పెన్నా బ్యారేజీపై నుంచి వెళుతున్నాయి. కడప వైపు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ సౌజన్య

దొంగల ముఠా అరెస్ట్

• 42 సవర్ల బంగారు ఆభరణాల స్వాధీనం

నెల్లూరు(క్రైం): జూలై 13: వరుస దొంగతనాలకు పాల్పడుతూ పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. ఓ కేసులో పాత నేరస్థులను అదుపులోకి తీసుకొని విచారించగా మరో కేసులోనూ వారే నిందితులుగా తేలింది. నిందితుల నుంచి 42 సవర్ల బంగారు ఆభరణాలు, ఒక టీవీని రికవరీ చేశారు. నిందితుల వివరాలను శనివారం నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య విలేకర్లకు వివరించారు. ముత్తుకూరు మండలం బ్రహ్మదేవికి చెందిన షేక్ గౌస్‌బాషా అలియాస్ లాషా అలియాస్ గుడ్డి గౌస్ జల్సాలకు అలవాటు పడి వ్యసనాలకు బానిసై దొంగతనాలు చేయడం వృత్తిగా మార్చుకున్నాడు. తన స్నేహితులు బుచ్చిరెడ్డిపాలెం ఖాజానగర్‌కు చెందిన షేక్ అల్తాఫ్, ముత్తుకూరు మండలం బ్రహ్మదేవికి చెందిన ప్రస్తుతం వెంకటేశ్వరపురం ప్రాంతంలో ఉన్న షఫ్రక్ అబీద్‌లతో కలిసి చోరీలకు పాల్పడేవారు. ఈ క్రమంలో గత నెల 26వ తేదీన బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలోని బ్రాహ్మణవీధిలో నివశిస్తున్న ఓ కుటుంబం సభ్యులు నర్రవాడ తిరునాళ్లకు వెళ్లారు. దానిని పసిగట్టిన నిందితులు ముగ్గురు అదే రోజు రాత్రి ఆ ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బంగారు నగలు దోచుకెళ్లారు. అలాగే గత నెల 18వ తేది రాత్రి టీపీ గూడూరు మండలం వరిగొండలోని జ్వాలాముఖి అమ్మవారి దేవస్థానం పరిధిలో ఉన్న ఒక గదిలోకి ప్రవేశించి అమ్మవారి నగలు దోచుకెళ్లారు. జిల్లాలో వరుసగా జరుగుతున్న దొంగతనాలపై జిల్లా ఎస్పీ ఆరీఫ్‌హఫీజ్ ప్రత్యేక దృష్టి సారించారు. ఆయన ఆదేశాలతో ఏఎస్పీ పర్యవేక్షణలో సీసీఎస్ డీఎస్పీ పీ.రామకృష్ణాచారి, సీసీఎస్ సీఐలు సీహెచ్ కోటేశ్వరరావు, కె.సాంబశివరావు, బుచ్చిరెడ్డిపాలెం సీఐ ఎం.శ్రీరామారావు, సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడ్డారు. పాత నేరస్థులపై ప్రత్యేక నిఘా ఉంచి దొంగతనం జరిగిన ప్రాంతాల్లో సాంకేతిక ఆధారంగా కేసును దర్యాప్తు చేసి శనివారం ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. తమదైన శైలిలో విచారించగా రెండు దొంగతనాలతో పాటు ప్రకాశం జిల్లా కనిగిరి మండలం, తక్కెళ్లపాడులో ఉన్న రైతు భరోసా కేంద్రంలో టీవీని దొంగలించినట్లు అంగీకరించారు. దీంతో పోలీసులు వారి నుంచి 42 సవర్ల బంగారు ఆభరణాలు, టీవీని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని ఏఎస్పీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులు అందజేశారు.

గంజాయి పట్టివేత



నిందితుల వివరాలు తెలుపుతున్న ఏఎస్పీ సౌజన్య

నెల్లూరు(క్రైం): జూలై 13: ఆంజనేయ స్వామి విగ్రహం వెనుక చెట్ల పొదలలో నిల్వ ఉంచి అక్రమ రవాణా చేస్తున్న గంజాయిని నవాబుపేట పోలీసులు పట్టుకుని ఇద్దరు నిందితులను శనివారం అరెస్ట్ చేశారు. నిందితుల వివరాలను నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య విలేకర్లకు వెల్లడించారు. నవాబుపేట పోలీసు స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించిన ఇన్‌స్పెక్టర్ ఎం.బాబి ఈనెల 10వ తేదీన గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని అరెస్ట్ చేశారు. వారు ఇచ్చిన సమాచారంతో నగరంలోని భగత్‌సింగ్ కాలనీలో టిట్కో ఇండ్ల వద్ద ఆంజనేయస్వామి విగ్రహం వెనుక చెట్ల పొదల్లో గంజాయి నిల్వలు ఉంచారన్న సమాచారం రావడంతో తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. గంజాయిని అక్రమ రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్న 3 కేజీల 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, నగరంలోని కోటమిట్ట, పెద్దబజారు కుమ్మరివీధికి చెందిన షేక్ షాహుల్ హమీద్ అలియాస్ షాహుల్, షేక్ అల్లాబక్షులను అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఇంకొందరు నిందితులను అరెస్ట్ చేయాల్సి ఉందని ఏఎస్పీ తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో భాగంగా యువత మేలుకో -భవితను మలచుకో- డ్రగ్స్‌ను వదులుకో అనే నినాదంతో టోల్ ఫ్రీ నెంబరు 14500ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ప్రజలు గంజాయి రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను మార్చడంలో సహకరించాలని కోరారు. గంజాయి అమ్మినా, రవాణా చేసినా, సాగు చేసినా కఠిన చర్యలు తప్పవని, గంజాయి కేసులలో శిక్షలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కావలి రూరల్, జూలై13: గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఓ వ్యక్తి(40) మృతి చెందాడు. మృతదేహాన్ని కావలి మండలం సర్వాయపాలెం క్రాస్ రోడ్డు సమీపంలో శనివారం స్థానికులు గుర్తించి వీఆర్వోకి సమాచారమిచ్చారు. వీఆర్వో హరీష్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మహేంద్ర లేఅవుట్ సమీపంలో నెల్లూరు నుంచి ఒంగోలు వైపునకు వెళ్తున్న గుర్తు తెలియని లారీ ఢీ కొనటంతో మృతదేహం నుజ్జునుజ్జు అయింది. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో మృతుడు బిచ్చగాడని వారు అనుమానిస్తున్నారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు రూరల్ సీఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బయల్పడిన పురాతన రాతి విగ్రహాలు



బయల్పడిన లక్ష్మీదేవి, సరస్వతీదేవి విగ్రహాలు

ఉదయగిరి, జూలై 13: పట్టణ శివారు ప్రాంతంలోని అటవీ ప్రాంతంలో పురాతన విగ్రహాలు లభ్యమయ్యాయి. ఇటీవల ఉదయగిరి ఉత్తరంవైపున హైవే రోడ్డు నిర్మాణ పనులను గుత్తేదారులు చేపట్టారు. పనులు చేపడుతున్న సమయంలో కాలగర్భంలో కలిసిన ఓ ఆలయం రాతి విగ్రహాలు బయల్పడ్డాయి. యంత్రాలు పనిచేస్తున్న సమయంలో పెకిలించడంతో రాతి విగ్రహాలు ముక్కలయ్యాయి. గమనించిన వ్యక్తులు వాటిని హైవే రోడ్డుపక్కన చెట్ల మధ్య ఉంచి పనులను చేపట్టారు. అయితే కొందరు ఆ ప్రాంతంలో నిధినిక్షేపాలు బయల్పడ్డాయని చెబుతున్నారు. ఏదిఏమైనా పురావస్తుశాఖ అధికారులు స్పందించి పరిశీలిస్తే నిజానిజాలు నిగ్గు తేలుతాయని స్థానికులు గుసగుసలాడుతున్నారు. వారు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చిరమన గ్రామంలో చోరీ

ఏఎస్‌పేట, జూలై 13: చిరమన గ్రామనికి చెందిన కాటంరెడ్డి చిన్న పెంచల్‌రెడ్డి ఇంట్లో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. వివరాల మేరకు.. పెంచల్ రెడ్డి దంపతులు రాత్రి ఇంటి వరండాలో నిద్రించారు. ఈ సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి నాలుగు సవర్ల బంగారు సరుడు, చేతి వాచి తీసుకెళ్లారు. ఉదయం విషయం తెలుసుకున్న పెంచలరెడ్డి కుమారుడు జనార్దన్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వివిధ కోణాలలో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	131
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	236
స్కిన్‌లెస్	264
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6972
వెండి కిలో ధర	రూ. 94,900
వెండి ఒక గ్రాము	రూ. 96.90

తెల్లరాయి తవ్వకాలపై సీసీఎస్ అధికారుల విచారణ

ఉదయగిరి రూరల్, జూలై 13: మాసాయిపేట, కొండాయపాళెం అప్పసముద్రం, ఆర్లపడియ, కృష్ణంపల్లి, తిరుమలాపురం గ్రామాల్లో తెల్లరాయి తవ్వకాలు, అక్రమ రవాణాపై ఓ వ్యక్తి రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు శనివారం సీసీఎస్ సీఐ సాంబశివరావు, ఏఎస్ఐ రవిలు విచారణ చేపట్టారు. ముందుగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తెల్లరాయి తవ్వకాలు, అక్రమ రవాణాపై ఏమైనా కేసులు నమోదు అయ్యాయా అని ఆరా తీశారు. అనంతరం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు నెహ్రూబాబుతో చర్చించారు. ప్రభుత్వ భూముల్లో ఎక్కడైనా తెల్లరాయి తవ్వకాలు జరిగిన సంఘటనలపై ఆరా తీయడంతో పాటు లీజు క్వారీల వివరాలను సేకరించారు.

కార్పొరేషన్లు నిర్వీర్యం!

• ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అందని సంక్షేమం
• నిధులు లేక దిష్టిబొమ్మల్లా కార్యాలయాలు
• పూర్వవైభవం వస్తుందని ఆశాభావం

నెల్లూరు(హరనాథపురం), జూలై 13: వైసీపీ పాలనలో సంక్షేమ కార్పొరేషన్లు నిర్వీర్యం అయ్యాయి. నిధులు లేక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సంక్షేమం అందని ద్రాక్షలా మారింది. ఆయా కార్యాలయాలు దిష్టి బొమ్మల్లా మారాయి.. 2019కి ముందు కార్పొరేషన్ల ద్వారా అమలు జరుగుతున్న పథకాలన్నింటిని వైసీపీ ప్రభుత్వం రద్దు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఉపాధి లేకుండా చేసిందన్న ఆరోపణలు ఉన్నాయి. బీసీ కార్పొరేషన్ ద్వారా అమలయ్యే ఆదరణ పథకాన్ని ఎత్తేసి కుల వృత్తులపై ఆధారపడి జీవించే వారికి తీరని అన్యాయం చేసింది. ఈ నేపథ్యంలో కొత్తగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ కార్పొరేషన్లకు పూర్వవైభం తీసుకొచ్చి గతంలో ఏ పథకాలైతే అమలయ్యాయో వాటన్నింటిని అమలు చేస్తుందన్న ఆశాభావం ఆయా వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లు ఉన్నాయి. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఈ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు, ఉపాధి పథకాలు నిరుద్యోగులకు అందేవి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ కార్పొరేషన్ల నిధులన్నీ నవరత్నాల పథకాలకు మళ్లించి ఖజానాను ఖాళీ చేసింది. ఆ కార్పొరేషన్ల ద్వారా వైసీపీ పాలనలో ఎవరికీ ఏలాంటి లబ్ధి చేకూరలేదు.

• **కార్పొరేషన్ల ద్వారా ఇతోధికంగా రుణాలు**

ఎస్సీ, ఎస్టీ , బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోసం 2019కి ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వం సబ్సిడీపై రూ.వేలాది కోట్ల రుణాలు మంజూరు చేసింది. 50 శాతం సబ్సిడీపై రూ.లక్ష, రూ.2 లక్షల రుణాలను విరివిగా మంజూరు చేసింది. జిల్లాలో 1094 మంది లబ్ధిదారులకు రూ.21.78 కోట్ల మేరకు రుణాలు అందచేసింది. ఎస్సీ నిరుద్యోగ యువత, చిన్న తరహా వ్యాపారాలను చేసుకోవడానికి ఒక్కొక్కరికి రూ.2 లక్షల వంతున రుణాలు మంజూరు చేసింది. ఎస్టీలకు సంబంధించి ఐటీడీఏ ద్వారా ఓబీఎంఎంఎస్ బ్యాంకు లింకేజీ రుణాలను 561 మందికి రూ.6.38 కోట్లు అందచేసింది. 68 మందికి ఎన్ఎస్‌టీఎఫ్‌డీసీ రుణాలను రూ.3.08కోట్లు అందచేసింది. 498 మందికి నైపుణ్య శిక్షణ అందచేశారు. అదేవిధంగా ఇటుకల తయారీ, సెల్‌ఫోన్ పాయింట్, డీటీపీ-జెరాక్సు, కంప్యూటర్-ఇంటర్నెట్ సెంటర్‌లను నిరుద్యోగ యువత ఏర్పాటు చేసుకొని జీవనోపాధిని పొందారు.



ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం



బీసీ కార్పొరేషన్ కార్యాలయం

మైనార్టీ కార్పొరేషన్ ద్వారా 5,312 మంది లబ్ధిదారులకు రూ.24.94 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలను అందచేశారు. క్రిస్టియన్ కార్పొరేషన్ ద్వారా 355 మందికి రూ.2.77 కోట్ల రుణాలను అందచేశారు. బీసీ కార్పొరేషన్ ద్వారా 2014-18 సంవత్సరాల మధ్య కాలంలో 11,432 మందికి రూ.55.02కోట్ల రుణాలను అందచేశారు. ఈ రుణాలతో పాటు సబ్సిడీపై వాహనాలు అందించింది. చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఎస్సీ, ఎస్టీల ఆర్థిక పురోభివృద్ధికి ఎంతో ప్రోత్సాహమిచ్చింది. గొర్రెల పెంపకం, పాడిపరిశ్రమ, పెద్ద, చిన్న తరహా గార్మెంట్లు, జనరల్ స్టోర్స్ తదితర చిన్నతరహా వ్యాపారాల కోసం ఒక్కక్కరికి రూ.2 లక్షల నుంచి ఐదు లక్షల వరకు రుణాలు మంజూరు చేసింది. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో తెలుగుదేశం ప్రభుత్వ పథకాలకు గ్రహణం పట్టింది. కేవలం నవరత్నాలు ఇస్తున్నామనే ముసుగులో కార్పొరేషన్ల ద్వారా అందించే రుణాలను ఎత్తేసింది. ఉన్న నిధులను ఇతర పథకాలకు మళ్లించి కార్పొరేషన్లను నిర్వీర్యం చేసింది. ఫలితంగా ఔత్సాహికులు ఐదేళ్లలో పడరాని పాట్లుపడ్డారు.

• **కుల వృత్తులకు అందని పనిముట్లు**

కుల వృత్తులపై ఆధార పడి జీవిస్తున్న వారి కోసం అప్పటి టీడీపీ ప్రభుత్వం ఆదరణ పథకం ద్వారా ఇస్త్రీపెట్టెలు, వాషింగ్ మెషీన్‌లు, తోపుడు బండ్ల కోసం రుణాలు, హెయిర్ కటింగ్ సెలూన్ సామాన్లు, కుట్టు మిషన్లు, సైకిళ్లు, చేనేతలకు మగ్గాలు, ముడి సరకుకు అవసరమైన రుణాలు, కార్పెంటర్లకు డ్రిల్లింగ్ మిషన్లు అందచేసి అండగా నిలిచింది. వీటితో పాటు బలహీన వర్గాల్లో ఎవరైతే అత్యంత వెనుకబడ్డారో అలాంటి వారికి రూ.30వేల ఆర్థిక సహాయం అందించింది. అయితే వైసీపీ ప్రభుత్వం వారి కడుపు కొట్టిందని ఆయా వర్గాలు మండిపడుతున్నాయి. మరోవైపు సొసైటీలకు అందించే రుణాలకు మంగళం పాడింది. 14 లేదా 15 మందితో కూడిన ఒక సొసైటీకి సుమారు రూ.10లక్షలకు పైగా రుణాలను గత టీడీపీ ప్రభుత్వం అందచేసింది. వాటిని సైతం పక్కదారి పెట్టించడంతో ఆయా సొసైటీల నాయకులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆయా సొసైటీలు సైతం టీడీపీ ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. ప్రస్తుతం టీడీపీ అధికారంలోకి రావడంతో ఆయా పథకాలన్నీ తిరిగి అమలు చేయాలని పలువురు కులనాయకులు, విద్యార్థి సంఘాల వారు కోరుతున్నారు.

దళితులకు ఇన్నోవా కార్లు అందాయి



ఎస్సీ కార్పొరేషన్ ద్వారా గత టీడీపీ ప్రభుత్వంలో దళితులకు ఇన్నోవాకార్లు, అనేక పథకాలు అందడంతో జీవనోపాధి పొందారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారు. సబ్‌ప్లాన్ నిధులను కూడా దారి మళ్లించారు. మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సంక్షేమ పథకాలు అందుతాయని ఆశిస్తున్నాం. ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయాన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సంక్షేమ భవన్ ప్రాంగణంలో పునర్నిర్మించాలి.

- పందిటి సుబ్బయ్య, సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు

కులవృత్తుల వారికి సబ్సిడీ రుణాలు అందించాలి



బీసీ కులాల వారికి వారి వారి కులవృత్తులు చేసుకోడానికి సబ్సిడీపై రుణాలు అందజేయాలి. పనిముట్లను ఉచితంగా అందచేయాలి. బీసీ కులవృత్తుల వారికి ఒక ఇండస్ట్రియల్ పాలసీని కొత్త విధానాలతో తీసుకురావాలి. పరిశ్రమల స్థాపనకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలు అందచేయాలి. తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం కల్పించాలి. బీసీలకు జీవనోపాధులు కల్పించే అనేక పథకాలను అమలు చేయాలి.

- పలమాల శ్రీహరిరావు, జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు

ఎస్ఎస్ఏ ఏపీసీ ఆకస్మిక తనిఖీలు

నెల్లూరు(విద్య), జూలై 13: సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సీహెచ్.ఉషారాణి శనివారం జిల్లాలోని పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గొల్లపాళెంలోని చైల్డ్ ఆశ్రమ పాఠశాల, ఏఎస్‌పేటలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, ఆత్మకూరులోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠాలలను ఆమె తనిఖీ చేశారు. పిల్లలకు సంబంధించిన హాజరు పట్టికను, వారికి అందిస్తున్న భోజన సదుపాయాలను, ఉపాధ్యాయుల హాజరు తదితర అంశాలతో పాటు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న వసతులన్నీ కూడా పక్కాగా విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. పిల్లలు కూడా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని విద్యలో ఉత్తమంగా రాణించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో సుధీర్‌బాబు, ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గంగపట్నం రమణయ్య

వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర ప్రకటించాలి

• ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమణయ్య

నెల్లూరు(వైద్యం), జూలై 13 : వ్యవసాయ ఉత్పత్తులకు రాష్ట్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగపట్నం రమణయ్య డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో రైతు సంఘం కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమశిల ప్రాజెక్టులో సరిపడా సాగునీరు లేక 7 లక్షల ఎకరాలను గాను 3 లక్షల ఎకరాలు మాత్రమే రబీలో సాగయ్యాయన్నారు. ఖరీఫ్‌లో లక్ష ఎకరాలు మాత్రమే సాగయ్యాయని చెప్పారు. మెట్ట ప్రాంతాలలో వర్షాలు లేక కరువు విలయ తాండవం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో కౌలదారులు 50 శాతం భూమిని మాత్రమే సాగు చేస్తున్నారని, వీరి గుర్తింపు కార్డులకు నిబంధనలు అడ్డు రావడంతో కౌలు రైతుల ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. జిల్లాలోని సోమశిల, కండలేరు, కనిగిరి, సర్వేపల్లి రిజర్వాయర్‌లో తగినన్ని నీళ్లులేక పంట కాలువలు పూడిపోయి ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో రైతులు తీసుకున్న పంట రుణాలను ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. సోమశిల ప్రాజెక్టు అప్రాన్ పనులు వెంటనే ప్రారంభించాలని, 50 శాతం సబ్సిడీతో విత్తనాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సం ఘం జిల్లా అధ్యక్షుడు షానవాజ్, రాజగోపాల్, నెల్లూరు రమణయ్య, మస్తాన్‌బాబు, మల్లికార్జున పాల్గొన్నారు.

జీపీఎస్ గెజిట్‌ను రద్దు చేయాలి : యూటీఎఫ్



జీపీఎస్ ప్రతులను దహనం చేస్తున్న యూటీఎఫ్ నేతలు

నెల్లూరు (విద్య), జూలై 13 : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీపీఎస్ గెజిట్‌ను వెంటనే రద్దు చేయాలని యూటీఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. నగరంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయం ఎదుట శనివారం సాయంత్రం జీపీఎస్ గెజిట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి ఎన్.నవకోటేశ్వరరావు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తానని చెప్పి ఐదేళ్లు అమలు చేయకపోగా దుర్మార్గమైన జీపీఎస్ విధానాన్ని శాసన సభలో చట్టం చేశారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలరోజులకే జీపీఎస్ చట్టాన్ని గెజిట్ రూపంలో విడుదల చేయడం అన్యాయమన్నారు. దీన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని, వెంటనే దీన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానం అమలుకు ప్రతిపాదనలు రూపొందించాలని, లేని పక్షంలో జీపీ ఎస్ పోరాట కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్ర మంలో జిల్లా అధ్యక్షుడు వివి.శేషులు, ప్రధాన కార్యదర్శి జివి.చలపతిశర్మ, కార్యదర్శులు సురేంద్రబాబు, రవిబాబు, నేతలు అమర్నాథ్, సుబ్రహ్మణ్యం, పార్వతీశం, రామ్మోహన్, మనోహరం తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), జూలై 13 : ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఇంటర్ వృత్తి విద్య ద్వారా డిప్లమా ద్వితీయ సంవత్సరంలో చేరేందుకు స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, నోడల్ అధికారి జె.రాంప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐవీసీ ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన వారు ఈనెల 16వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తులు అందజేయా లన్నారు. ఈనెల 18వ తేదీ నుంచి ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు.

సోమశిలలో 9.920 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం, జూలై 13: సోమశిల పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా శనివారానికి డ్యాంలో 9.920 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎగువ నుంచి 71 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలు వలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

అక్రమంగా క్వార్ట్జ్ తరలిస్తున్న లారీల స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న క్వార్ట్జ్ లారీలు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూలై 13: ఎలాంటి అనుమతు ల్లేకుండా అక్రమంగా మైకా, క్వార్ట్జ్‌ను తరలిస్తున్న నాలుగు లారీలను ఎస్ఐ ఉమా శంకర్ తన సిబ్బందితో కలిసి గురువారం రాత్రి స్వాధీనం చేసుకొన్న సంఘటన శనివారం వెలుగుచూసింది. కొండాపురం మండలం నుంచి అన్నమయ్య జిల్లాకు నాలుగు లారీల్లో మైకా, క్వార్ట్జ్ కలిసిన రాయిని తరలిస్తున్నారు. సాధారణ తనిఖీల్లో పోలీసులు వాటిని నిలిపి అనుమతులు పత్రాలు అడగ్గా వారి వద్ద లేకపోవడంతో స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. పట్టుబడిన లారీలను మైనింగ్ శాఖ అధికారులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కావలి రూరల్, జూలై13: ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని శనివారం తాళ్లపాలెం మురళి(50) ఆత్మహత్య చేసుకున్నారు.ఈ సంఘటన ముసు నూరు వినా యక కాలనీలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల కథనం మేరకు, మురళికి 25 ఏళ్ల క్రితం వివాహం కాగా, ఏడాది క్రితం భార్యభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో విడాకులు తీసుకు న్నారు. అప్పటి నుంచి మురళి పనులకు పోకుండా ఇంటి దగ్గ రే ఉండేవాడు. మృతుడి తండ్రి మాల్యాద్రి పట్టణంలోని దేవి థియేటర్ రోడ్డులోని ఓ సెలూన్‌లో పనిచేసేవాడు. ఇంట్లో ఎవ రూలేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని మురళి మృతి చెంది ఉండటాన్ని బంధువులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘ టనా స్థలాన్ని పరిశీలించిన సీఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జింకలను తరుముకున్న కుక్కలు



డిగ్రీ కళాశాల సమీపంలోని చెట్ల పొదల్లోకి పరుగులు తీసిన జింకలు

ఉదయగిరి, జూలై 13: అటవీ ప్రాంతం నుంచి పట్టణ శివారు ప్రాంతంలోకి శనివారం జింకలు పరుగులు తీశాయి. మధ్యాహ్నం ఆర్టీసీ డిపో సమీపంలో మేకపాటి రాజమోహన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోకి వచ్చిన జింకలను ఊరకుక్కలు గమనించి వెంట పడడంతో అవి ముళ్లపొదల్లోకి పరుగులు తీశాయి. వాటి భారీ నుంచి తప్పించుకొని వ్యవసాయ కళాశాల సమీపంలోని అటవీ ప్రాంతం గుండా హైవే రోడ్డుపైకి పరుగులు తీశాయి. అక్కడ కూడా కొంతమంది పశువుల కాపర్లు వాటిని గమనించి అరవడంతో అవి కొండాయపాళెం ప్రభుత్వ భూముల వైపు పరుగులు తీశాయి. ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు స్పందించి ఊరకుక్కలు, వేటగాళ్ల బారినపడకుండా జింకలను సంరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ స్వాధీనం

కొండాపురం: అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను ఎస్సై మహేంద్ర శనివారం అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని ఇస్కదామెర్ల వద్ద పిల్లాపేరులో పామూరు మండలం కంబాలదిన్నెకి చెందిన ట్రాక్టర్లు ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారంతో సిబ్బందితో కలసి దాడిచేశామన్నారు. ఈదాడిలో ఐదు ట్రాక్టర్లతోపాటు ఓ ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అందని సాగునీరు

● నిరుపయోగంగా సోమశిల ఉప కాలువలు

● బీళ్లుగా మారిన పొలాలు



ఆర్ ఉప కాలువ కింద బీడుగా ఉన్న పొలాలు

ఆత్మకూరు, జూలై 13: సోమశిల జలాలు చెంతనే ఉన్నా సాగునీటికి నోచుకోక పోవడంతో మండలంలోని గ్రామాల రైతులు దశాబ్దల కాలంగా పొలాలను బీడులుగానే పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈ పొలాలకు సాగునీరు అందించేందుకు లక్షలాది రూపాయల నిధులతో నిర్మించిన ఉప కాలువలు నిరుపయోగంగా మారాయి. ఏళ్ల తరబడి కింద నిర్మించిన ఈ కాలువలు అప్పుడప్పుడు మరమ్మతుల పేరుతో కాంట్రాక్టర్లకు కల్పతరువుగా మారుతున్నాయో తప్ప రైతులకు మాత్రం వీటితో ఎలాంటి ఉపయోగం లేదని రైతులు వాపోతున్నారు. ఇందుకు సోమశిల 12ఆర్ ఉపకాలువే ప్రత్యక్ష నిదర్శనం. అనంతసాగరం మండలం కామిరెడ్డిపాడు గ్రామానికి చెందిన 175ఎకరాలకు సాగునీరు అందించేందుకు సోమశిల ఉత్తర కాలువ నుంచి 12ఆర్ ఉపకాలువను 18సంవత్సరాల క్రితం నిర్మించారు. సుమారు రూ.50లక్షలకు పైబడి నిధులతో కాలువ పనులు, కల్వర్టులు నిర్మాణం చేపట్టారు. అయితే అప్పటి నుంచి ఇప్పటివరకు ఆయకట్టు చివరకు సాగునీరు అందిన దాఖలాలు లేవు. పదేళ్ల క్రితం అప్పటి ఆర్థికశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కామిరెడ్డిపాడుకు విచ్చేసిన సందర్భంగా రైతులు 12 ఆర్ ఉపకాలువ మరమ్మతుల విషయం ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దాంతో ఆయన తిరిగి నిధులు మంజూరు చేయించారు. ఆ నిధులతో కొంత మేర పనులు జరగడంతో 20 ఎకరాలకు పైబడి మాత్రమే సాగునీరు అందే అవకాశం ఏర్పడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయకట్టు చివరి వరకు మిగిలిన 150 ఎకరాలకు సాగునీరు లేక రైతులు అవస్థలు పడుతున్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన మేకపాటి దంపతులు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, శాంతికుమారి

ఉదయగిరి రూరల్, జూలై 13: ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి శాంతికుమారిలు శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారితో చంద్రబాబు కొద్దిసేపు ఏకాంతంగా చర్చించారు. జరిగిన ఎన్నికల్లో ఉదయగిరి, ఆత్మకూరు అభ్యర్థుల విజయానికి మీరు చేసిన కృషి మరువలేనిదని సీఎం అభినందించినట్లు తెలిపారు.

సాయి భక్తుల భిక్షాటన



భిక్షాటనలో పాల్గొన్న భక్తులు

వరికుంటపాడు, జూలై 13: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో వెలసిన షిర్డీ సాయిబాబా ఆలయంలో ఈ నెల 21న నిర్వహించే గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా శనివారం సాయిభక్తులు గ్రామాల్లో భిక్షాటన చేపట్టారు. ప్రత్యేక వాహనంలో పల్లెల్లో ప్రచారం నిర్వహించి నగదు, ఇతర వస్తువులను సేకరించారు. గురుపౌర్ణమిరోజు పూజా కార్యక్రమాలు, మహా అన్నదానం చేస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూలై 13: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా ఆదివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1గంట వరకు 11కేవీ దుత్తలూరు ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ వెంకటసుబ్బయ్య శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు అందుకు సహకరించాలని ఆయన కోరారు.

మంత్రిని కలిసిన చెంచలబాబు



మంత్రి సత్యప్రసాద్‌ను సన్మానిస్తున్న చెంచలబాబు

ఉదయగిరి రూరల్, జూలై 13: మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసయాదవ్‌లను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

మాలకొండ ఆదాయం రూ.11.29 లక్షలు

వలేటివారిపాలెం, జూలై 13: మాలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి భక్తుల కానుకలతో రూ.11.30లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కే.బీ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అష్టోత్తరం టిక్కెట్ల ద్వారా రూ.8,400, కుంకుమార్చనతో రూ.24,640, వివాహాలతో రూ.2వేలు, తలనీలాలు ద్వారా రూ.56,300, వాహనపూజలతో రూ.6,100, ప్రత్యేకదర్శనం ద్వారా రూ.3,78,000, స్థలపురాణం పుస్తకాలు విక్రయంతో రూ.640, రూముఅద్దెలతో రూ.32,120, కవర్ల ద్వారా రూ.7,500, లడ్డుప్రసాదంతో రూ.2,09,640, అన్న దానం ద్వారా రూ.3,86,005, విరాళముల ద్వారా రూ.17,117 వచ్చిందని పేర్కొన్నారు.

పాడి పశువులకు టీకాలు

వింజమూరు, జూలై 13: బుక్కాపురం గ్రామంలో శనివారం పశుసంవర్ధక శాఖ అధికారి కొమ్మి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పాడి పశువులకు ఉచితంగా గుండెజబ్బు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాడి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



గేదెకు టీకా వేయిస్తున్న బుక్కాపురం రైతు

మేలైన పశుగ్రాసం సాగుపై అవగాహన



రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న ఆత్మకూరు ఏడీ డాక్టర్ జయచంద్ర

ఆత్మకూరు, జూలై 13: మండలం లోని కరటంపాడు, బి.చిరువెళ్లలో పశు గ్రాస వారోత్సవాల సందర్భంగా శనివారం పశువైద్యాధికారి కృష్ణయ్య యాదవ్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆత్మకూరు పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎస్ జయచంద్ర ముఖ్యఅతిథిగా హాజరై రైతులకు మేలైన పశుగ్రాసాల సాగుపై అవగాహన కల్పించారు. పశుగ్రాసాల చెట్లు పెంపకం, పప్పుజాతి పశుగ్రాసాల పెంపకం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం రైతులకు 4జి సూపర్ నేపియర్, ఆఫ్రికన్ టాల్ మొక్కజొన్న విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతు సేవా కేంద్రం పశుసంవర్ధకశాఖ సహాయకులు వేణు పాల్గొన్నారు.

నేటినుంచి ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

ఆత్మకూరు, జూలై 13: మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన రూ.10.72 కోట్ల ఉపాధి పనులపై ఆదివారం నుంచి అన్ని గ్రామాల్లో సామాజిక బృందం సభ్యులు తనిఖీ నిర్వహిస్తున్నట్లు సోషల్ ఆడిట్ రాష్ట్ర రిసోర్స్ పర్సన్ ఎం.నాగార్జున తెలిపారు. స్థానిక మండల కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఈసీ జానకి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సామాజిక బృందం సభ్యుల తనిఖీల అనంతరం గ్రామసభలు నిర్వహించి అంచనాలను ప్రజలకు వివరిస్తామన్నారు. తదనంతరం మండల కేంద్రంలో జరిగిన బహిరంగ సమావేశంలో తుది నివేదికలు వెల్లడిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో శిరీషా, సామాజిక తనిఖీ డీఆర్‌పీఎస్‌లు, గ్రామ ఫీల్డ్‌అసిస్టెంట్లు, టీఏ, ఈసీలు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉత్తర్వులు వీరికి పట్టవా..?



ఉదయగిరిలోని పేరు మారని రైతుసేవా కేంద్రం

ఉదయగిరి రూరల్, జూలై 13: గత వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రాలను ఎన్డీఏ ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలుగా మారుస్తూ గత నెల 28వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో అమలు కావడం లేదు. అందులో భాగంగా ఉదయగిరి బిట్-1 రైతు సేవాకేంద్రంలో ఇప్పటికీ పేరు మార్చలేదు. భవనానికి ఉన్న రంగులు మార్చలేదు. సార్వత్రిక ఎన్నికల సమయంలో కోడ్ కారణంగా ఆ రంగులు మార్చేందుకు వ్యవసాయ శాఖ అధికారులు నానా తంటాలు పడ్డారు. నిధులు లేక పోవడంతో అధికారులు, సిబ్బంది నిమ్మకున్నట్లు తెలుస్తోంది.

వింజమూరులో కోతులు, కుక్కల బెడద !

వింజమూరు, జూలై 13: మండలకేంద్రంలోని అన్ని కాలనీల్లో కుక్కలు, కోతల బెడదతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎక్కడ చూసినా గుంపులు గుంపులుగా సంచరిస్తూ చిన్నారులను, వృద్ధులపై దాడులు చేస్తున్నాయి. ఒంటరిగా ఇళ్ల నుంచి బయటకు రావాలంటే హడలిపోతున్నారు. ఇటీవల టీచర్స్ కాలనీలో ఒక పాపను కుక్క కరిచింది. అలాగే ప్రధాన రహదారిపై కుక్కలు గుంపులుగా ఉండి అరుస్తు ఉండటంతో వాహనదారులు ఆ మార్గంలో వెళ్లేందుకు జంకుతున్నారు. యాదవ బజార్, వెలమ బజార్, గంగమెట్ట ప్రాంతాల్లో కోతులు స్వైర విహారం చేస్తున్నాయి. ఇంటి పరిసరాల్లో వస్తువులను చిందరవందర చేస్తున్నాయి. వీటిని తరిమేందుకు గృహిణులు ప్రయత్నం చేస్తే వారిపై దాడి చేస్తున్నాయి. వీటి వలన పట్టణ ప్రజలు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. పాలకులు దృష్టి సారించి కుక్కలు, కోతులు బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.

సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



జీవో ప్రతులు దహనం చేసి నిరసన వ్యక్తం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఆత్మకూరు, జూలై 13: సీపీఎస్ పెన్షన్ పథకాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కార్యాలయం ఎదుట శనివారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ పేరుతో విడుదల చేసిన జీవో 54 ప్రతులను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యుటీఎఫ్ నాయకులు మాట్లాడారు. ఉద్యోగులకు సీపీఎస్ పథకాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చి జగన్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ విధానాన్ని తుంగలో తొక్కిందని మండిపడ్డారు.

విద్యార్థులకు నగదు, బహుమతుల అందజేత

ఉదయగిరి రూరల్, జూలై 13: గండిపాళెం గురుకుల పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు పూర్వ విద్యార్థుల సంఘం ఏఏజీ ఆధ్వర్యంలో నగదుతో పాటు బహుమతులు అందజేశారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ప్రథమస్థానంలో నిలిచిన ఎస్.వేణుకు రూ.10 వేలు, ద్వితీయస్థానంలో నిలిచిన బీ.చైతన్యకు రూ.7,500లు, తృతీయస్థానంలో నిలిచిన శివాజీ, హర్షవర్ధన్‌లకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున నగదు అందజేయడంతో పాటు మెమొంటోలను అందజేశారు. కార్యక్రమంలో రూ.25వేలు ఆర్థికసాయం అందజేసిన ఎస్‌వీ.శ్రీధర్‌కు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఏఏజీ బృందం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఏఏజీ సభ్యులు షారన్, సుమన్, కిషన్, గాజులపల్లి సుబ్బారెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ పుష్పరాజు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దాతలను ప్రోత్సహించి, ఆలయ అభివృద్ధి చేయాలి



నృసింహుడి దర్శనానికి వెళ్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

వలేటివారిపాలెం, జూలై 13 : దాతలను ప్రోత్సహించి, ఆలయ అభివృద్ధికి మరింత కృషి చేయాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని మాలకొండ లక్ష్మీనృసింహస్వామిని శనివారం ఎమ్మెల్యే దర్శించుకున్నారు. అనంతరం కోనేరు, మహా అన్నదానం, లడ్డూ కౌంటర్, స్వామి దర్శనం అనంతరం బయటకు వచ్చే మెట్లమార్గం, కేశఖండనశాల, దుకాణాలు, మరుగుదొడ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. ఆలయ అభివృద్ధికి సహకరించే దాతలను సకల మర్యాదలతో స్వాగతించి ప్రత్యేక పూజలు చేయించాలన్నారు. భక్తులకు నాణ్యమైన భోజనం పెట్టాలని తెలిపారు. ఆలయంలో అవినీతి అక్రమాలకు చోటులేకుండా ప్రతి ఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు, తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, టీడీపీ నాయకులు మాదాల లక్ష్మీనరసింహం, కాకుమాను హర్షకుమార్, నవ్వులూరి రాజారమేష్, కామినేని అశోక్, కాకుమాను ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రూ. 10 కోట్లతో కావలి అభివృద్ధికి ప్రతిపాదనలు

కావలి, జూలై13: పట్టణంలో రూ.10 కోట్లతో అభివృద్ధి పనులకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇటీవల నెల్లూరులో ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశంలో కావలిలో అభివృద్ధి పనులకు రూ.10 కోట్లు మంజూరు చేస్తానని, అందుకు ప్రతిపాదనలు పంపమని పురపాలక శాఖ మంత్రి పొంగూరి నారాయణ చెప్పారు. దీంతో ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి ఆవివరాలను అధికారులకు తెలియచేసి, ప్రతిపాదనలను సిద్ధం చేయమని ఆదేశించారు. దీంతో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు

గుడ్లూరు, జూలై 13 : అనుమతులు లేకుండా అక్రమంగా ఇతర ప్రాంతాలకు ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను, పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు కథనం మేరకు, గుండ్లపాలెం మన్నేరు రేవు నుంచి ఇసుకను అక్రమంగా లోడుచేసుకొని తరలిస్తున్నట్లు సమాచారం అండడంతో పోలీసులు గుండ్లపాలెం అడ్డరోడ్డు వద్ద మాటువేసి, రెండు ట్రాక్టర్లను, ఇద్దరు డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్లపై కేసు నమోదుచేసి కందుకూరు కోర్టులో హాజరుపరిచామని ఎస్సై లక్ష్మణరావు శనివారం తెలిపారు.

వర్షంతో ఉపశమనం

కలిగిరి, జూలై13: ఆకాశం మబ్బులుపట్టి వర్షాలు కురుస్తుండడంతో మండల ప్రజలు ఉపశమనం పొందారు. రుతుపవనాలు బలంగా ఉన్న నేపథ్యంలో శనివారం రోజంతా చిరుజల్లులు పడుతుండటంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. మరో నాలుగైదు రోజులు వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ అధికారుల ప్రకటనతో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులు తెలిపారు.

బిలకూట క్షేత్రంలో గోవిందనామ స్మరణ

బిట్రగుంట, జూలై 13: బోగోలు మండలం బిలకూట క్షేత్రం శనివారం భక్తుల గోవిందనామ స్మరణలతో మారుమోగింది. స్వామి,అమ్మవార్లను దర్శించుకునేందుకు చుట్టపక్కల మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. కావలి చెందిన టీడీపీ నాయకుడు తిరువీధి ప్రసాద్, ఆయన అనుచరులు పాదయాత్ర చేస్తూ స్వామివారి దర్శనానికి వచ్చారు. ఆయన్ను టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలశారు. దగదర్తి మండలం చెన్నూరుకు చెందిన కొమ్మి వెంకటేశ్వర్లు, అలివేలమ్మ దంపతులు భక్తులకు అన్నసంతర్పణ చేశారు. బెంగళూరు వాసులు గుదిమెళ్ల అనంతాచార్యులు-కొమలవల్లితాయారు, శ్రీనివాస్-మంజిర, మురళీకృష్ణ-ప్రత్యూష, రవికిరణ్ - శ్రీవాణి దంపతులు స్వామి వారి గరుడ సేవకు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

విద్యుదాఘాతంతో మహిళకు తీవ్ర అస్వస్థత

బిట్రగుంట, జూలై 13: బోగోలు మండలం తాళ్ళూరు సబ్ పోస్టాఫీస్ వీధిలో ఉంటున్న తిరుమలశెట్టి లక్ష్మి విద్యుదాఘాతంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. స్థానికుల కథనం మేరకు, శుక్రవారం రాత్రి లక్ష్మి తన స్వగృహంలో నీటి మోటరు వేసేందుకు స్విచ్ వేయగా విద్యుదాఘాతానికి గురైంది. గమనించిన కుటుంబ సభ్యులు మెయిన్ ఆఫ్ చేయడంతో ప్రమాదం తప్పింది. వెంటనే 108లో కావలి ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స చేయించామని బంధువులు తెలిపారు.

పెదపవనికి రాత్రిళ్లు బస్సు నడపండి

లింగసముద్రం, జూలై 13 : కందుకూరు డిపో నుంచి పెదపవని గ్రామానికి సాయంత్రం 6 గంటల తర్వాత బస్సు లేదు. దీంతో పెదపవనితోపాటు సమీప గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామానికి చెందిన ఎస్‌ఎం బాషా, మరికొందరు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో కందుకూరు నుంచి రాత్రి 7.30 గంటలకు పెదపవని మీదుగా వింజమూరుకు, అలాగే 8.30 గంటలకు పెదపవనికి వచ్చి అంగిరేకులపాడు వెళ్లే బస్సులను ఆర్టీసీ అధికారులు రద్దు చేశారని వారు తెలిపారు. కలెక్షన్లు లేవనే కారణంతో ఈ బస్సులను రద్దు చేశారని వారు చెప్పారు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

వరికుంటపాడు, జూలై 13: బెంగళూరులో ఆదివారం జరుగనున్న జనవిజ్ఞాన వేదిక జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు పిడుగు చెన్నకేశవులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 5వ మహాసభలకు జాతీయ, రాష్ట్రస్థాయి బాధ్యులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి బాధ్యులు, సభ్యులు తప్పనిసరిగా మహాసభలకు హాజరై, విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు.

నేటి నుంచి కలిగిరమ్మ తిరునాళ్ల



కలిగిరి, జూలై 13: నర్రవాడ వెంగమాంబ తిరునాళ్ల అనంతరం మెట్ట ప్రాంతంలో జరుపుకునే కలిగిరమ్మ తిరునాళ్లను జిల్లాలో జరిగే పెద్దఉత్సవాల్లో ఒకటిగా పేర్కొనవచ్చు. ఆదివారం నుంచి గురువారం వరకు వైభవంగా ఈ తిరునాళ్లను నిర్వహించనున్నారు. స్థానికులు దూరప్రాంతంలో ఉన్న తమ బంధుమిత్రులను ఆహ్వానించి తిరునాళ్లను ఇంటిల్లిపాది సంతోషంగా జరుపుకుంటారు. అనాది నుంచి వస్తున్న ఆచారాల ప్రకారం అమ్మవారి తిరునాళ్లను ఆచార కాపులు అయిన కలిగిరి చెందిన 'అక్కరాజు'వంశం, పాపనముసిలిపాలెంకు చెందిన 'పాపన' వంశం, జిర్రవారిపాలెంకు చెందిన 'జిర్రా' వంశం వారి అనుమతులతో ప్రారంభిస్తారు. ఉత్సవాలకు ముందురోజున అమ్మవారి గుడి ముందు సుడిమాను ప్రతిష్ఠించడం ఆచారంతోపాటు ప్రత్యేక ఆకర్షణ. ఈ ఉత్సవాల్లో పొట్టేళ్ళు, ఎడ్లబండ్లు, ట్రాక్టర్లపై అందంగా ప్రభలను అలంకరించుకొని, ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తారు. అమ్మవారి తిరునాళ్లకు భారీగా భక్తులు తరలిరానున్నారు.

కొండబిట్రగుంటకు టీడీపీ శ్రేణుల పాదయాత్ర



తిరివీధి పాదయాత్రలో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలిటౌన్, జూలై 13: దగుమాటి కృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా గెలిస్తే కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వస్వామి ఆలయానికి పాదయాత్ర చేపడతానన్న మొక్కును తిరివీధి ప్రసాద్ శనివారం తీర్చుకున్నారు. కచ్చేరిమిట్టలోని వేంకటేశ్వస్వామి ఆలయం వద్ద జరిగిన పూజల్లో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి పాల్గొని ప్రసాద్‌ను స్వామి వస్త్రంతో సత్కరించారు. అనంతరం పాదయాత్ర ప్రారంభించి తహసీల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర చేశారు. ముసునూరు టోల్ ప్లాజా వద్ద జబర్దస్త్ ఫేమ్ శాంతి పాల్గొని తిరివీధిని సత్కరించారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్ చౌదరి, కావేటి కోటయ్య, పాలడుగు మురళి, పెంచలయ్య, గోపాల్, విష్ణుతేజారెడ్డి, ఆసిఫా తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వండి



పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న కందుకూరు టీడీపీ నాయకులు

కందుకూరు, జూలై 13: ప్రతిపక్షంలో ఉన్నకాలంలో టీడీపీ కోసం కష్టపడ్డ వారికి, గత ఎన్నికల్లో పార్టీ విజయం కోసం శ్రమించిన వారికి నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యతనివ్వాలని నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి జీ మోషే, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు విజ్ఞప్తిచేశారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో శనివారం పల్లాను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేసినట్లు మోషే తెలిపారు. పార్టీకోసం కష్టపడ్డ వారికి నామినేటెడ్ పదవుల్లో సముచితస్థానం కల్పిస్తామని పల్లా హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట నాయకులు గోనె ప్రతాప్‌కుమార్, గడ్డం నవీన్ తదితరులు ఉన్నారు.

కావలిలో పూడికతీత పనులు



వెంగళరావునగర్‌లోని మురుగుకాలువలో పూడిక తీస్తున్న ఎక్స్‌కవేటర్

కావలి, జూలై13: పట్టణంలో కొన్నేళ్లుగా పూడికతీతకు నోచుకోని కాలువల్లో మున్సిపల్ అధికారులు పూడికతీతకు శ్రీకారం చుట్టారు. వర్షాకాలం వస్తుండటంతో పూడిపోయిన కాలువల్లో పూడిక తీసి వర్షపు నీరు సజావుగా వెళ్లేందుకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. దీంతో మున్సిపల్ అధికారులు ఎక్స్‌కవేటర్లతో పూడిక తొలగిస్తున్నారు. అలాగే మున్సిపల్ పారిశుధ్య కార్మికులు కూడా కాలువల్లో దిగి పూడికను తీస్తున్నారు. తీసిన పూడికను కూడా ఎప్పటికప్పుడు పట్టణం వెలుపలకు తరలిస్తున్నారు.

కొమ్మిలో పశుగ్రాస వారోత్సవాలు



పశుగ్రాస క్షేత్రంలో పశు వైద్యాధికారి మధు, రైతులు

కొండాపురం, జూలై13: పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా శనివారం మండలంలోని కొమ్మి గ్రామంలో సాయిపేట పశువైద్యాధికారి ఎమ్.మధు పాడి రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసీజన్‌లో పశువులకు సంక్రమించే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. 75 శాతం రాయితీపై జొన్నలు కేజీ రూ. 23, మొక్కజొన్నలు కేజీ రూ. 17లకే అందచేస్తున్నామన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్ కార్డు, పాసుపుస్తకం తీసుకొని సచివాలయంలో వాటిని తీసుకోవచ్చని తెలియచేశారు. ఈకార్యక్రమంలో గ్రామ రైతులు, పశువైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాలనీలకు అందని సురక్షిత తాగునీరు

అల్లూరు, జూలై 13 : నగర పంచాయతీ పరిధిలోని మజరా గ్రామాల కాలనీల్లో సురక్షిత తాగునీరందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా బోడిసత్రం, ఆర్‌డీఆర్ కాలనీ, దళితవాడ, అరుంధతీయవాడ, రామాపురం కాలనీలతోపాటు చుట్టుపక్కల ఉండే 18 మజరా గ్రామాలకు తాగునీరందక ప్రజలు అవస్థలు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో పంచాయతీ సరఫరా చేసే నీరు తాగేందుకు ఉపయోగకరంగా లేదు. దీంతో దూరప్రాంతాల్లోని చేతిపంపులు, ఆర్‌వో ప్లాంట్లకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. తాగునీటి సరఫరాకు ప్రత్యేక అధికార వ్యవస్థ, నిధులు ఉన్నా, సమగ్రంగా తాగునీటిని అందించే పరిస్థితి లేదు. ఇప్పటికైనా అధికారులు తమకు సురక్షిత తాగునీటిని సరఫరా చేయాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.



కుళాయి వద్ద నీటి కోసం ఎదురుచూస్తున్న మహిళలు

సమస్యల వలయంలో సంక్షేమ హాస్టళ్లు

కనీస వసతుల్లేక విద్యార్థుల అగచాట్లు



ధ్వంసమైన కిటికీలు, శ్లాబ్ పెచ్చులూడి ఉన్న హాస్టల్ భవనం



హాస్టల్ ప్రహరీ గోడ కూలిపోవడంతో కట్టిన పట్టలు

పొదలకూరు, జూలై 13: సంక్షేమ హాస్టళ్లలో సమస్యలతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పొదలకూరులో ఒక ఎస్సీ బాలురు, ఒక ఎస్సీ బాలికల హాస్టల్, రెండు బీసీ బాలికల హాస్టళ్లు, అలాగే మహమ్మదాపురంలో రెండు బీసీ బాలుర, ఒక ఎస్సీ బాలుర హాస్టళ్లు ఉన్నాయి. వీటిలో సుమారు 700 మంది విద్యార్థులున్నారు. పట్టణంలోని పాత ఎంపీడీవో భవనంలో ఉన్న ఎస్సీ బాలికల వసతిగృహం ప్రహరీ గోడలోని కొంతభాగం గత ఏడాది జూన్ మాసంలో కూలినా ఇంతవరకు నిర్మించలేదు. దీంతో మెయిన్ రోడ్డుపై పోయే వారందరికీ హాస్టల్ టాయిలెట్స్ కనిపిస్తున్నాయి. దీంతో బాలికలు బయట బట్టలు ఆరవేసుకోవాలన్నా ఇబ్బందులు పడుతున్నారు. ప్రహరీ గోడ లేకపోవడంతో పశువులు, పందుల సంచారంతో అపరిశుభ్రత నెలకొనడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

చాలీచాలని స్నానపు గదులు, మరుగుదొడ్లు

వైసీపీ ఐదేళ్ల పాలనలో వసతి గృహాల నిర్వహణకు రూపాయి కూడా కేటాయించకుండా గాలికొదిలేశారు. దీంతో శిథిల భవనాలు, పెచ్చులూడుతున్న పైకప్పులు, విరిగిన తలుపులు, కిటికీలతో పాటు చాలీచాలని స్నానపు గదులు, మరుగుదొడ్లు, మంచినీటి సౌకర్యం లేక విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం. బయటి నుంచి క్యాన్లలో నీళ్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వసతి గృహాలలో సదుపాయాలు కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఘనంగా నృసింహుడి కల్యాణం



నృసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు (డక్కిలి), జూలై 13: పెంచలకోన నృసింహస్వామి సమేత ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీల కల్యాణంను శనివారం వేదపండితులు, అర్చకుల మంత్రోత్సాహల మధ్య కన్నుల పండువగా నిర్వహించారు. ఈ వేడుకలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఊంజలసేవ చేపట్టారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఏసీ సాగర్‌బాబు ఏర్పాట్లును పర్యవేక్షించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

మొక్కు తీర్చుకున్న తెలుగుదేశం నాయకులు



టెంకాయలు కొడుతున్న డేగ యశ్వంత్ తదితరులు

పొదలకూరు, జూలై 13: సార్వత్రిక ఎన్నికల్లో సర్వేపల్లి ఎమ్మెల్యేగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఘన విజయం సాధించడంతో పొదలకూరుకు చెందిన టీడీపీ నాయకుడు డేగ యశ్వంత్‌రెడ్డి శనివారం పెంచలకోనలో 1500 టెంకాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం రావణకాష్ఠంగా మారిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గార్ల యశ్వంత్, జయచంద్ర, గిరి, రాధ, కార్తిక్, తదితరులు పాల్గొన్నారు.

జగదేవిపేటలో 104 వైద్య శిబిరం

ఇందుకూరుపేట, జూలై 13: మండలంలోని జగదేవిపేట పీహెచ్‌సీ పరిధిలో లేబూరు బిట్ -2 వడ్డిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం 104 ఉచిత వైద్య శిబిరం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సి కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు మాట్లాడుతూ 104 ఉచిత వైద్య శిబిరంలో రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆశా వాలంటీర్లు, అంగన్‌వాడీ టీచర్లు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ నందిని, హెల్త్ అసిస్టెంట్ మాధవ, హెల్త్ సెక్రటరీ ధనలక్ష్మీ, 104 వైద్య సిబ్బంది, డీఈఓ లక్ష్మణ్, పైలెట్ సుల్తాన్‌బాషా, ఆశా వాలంటీర్ సుబ్బలక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్ హరిత పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు



తిప్పిరెడ్డిపల్లిలో పరిస్థితిని తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో పెంచలయ్య

సైదాపురం, జూలై 13: వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో పెంచలయ్య హెచ్చరించారు. శనివారం ఆయన తిప్పిరెడ్డిపల్లిలో జరుగుతున్న మెడికల్ క్యాంప్‌ను ఆయన పరిశీలించారు. ఇందులో ఐదుగురు డయేరియా వ్యాధికి గురై చికిత్స పొందుతున్న వారితో పరీక్షించారు. పరిసరాలను పరిశీలించి వైద్య సిబ్బందికి సూచనలిచ్చారు. డయేరియా గురైన వారికి మెరుగైన వైద్య సదుపాయం కల్పించడంతో అదుపులోకి వచ్చిందన్నారు నివాస గృహాలను పరిశీలించి మురుగునీరు నిల్వ లేకుండా, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వైద్య సిబ్బంది నిత్యం గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సీజనల్‌వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జనార్దన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పొట్లపూడమ్మకు పూజలు



ప్రత్యేక అలంకారంలో పొట్లపూడమ్మ

తోటపల్లిగూడూరు, జూలై 13: గ్రామదేవత పొట్లపూడమ్మకు శనివారం ఘనంగా పూజలు నిర్వహించారు. మూడు రోజులపాటు అమ్మవారికి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. మూడు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే ఉత్సవాల సందర్భంగా గ్రామంలో సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో ఉత్సవాల నిర్వాహకులు నాశన రామయ్య, నాశన గిరీష్, వెంపులూరు ఏడుకొండలు, కదురు వెంకటరమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా పెరసం 15వ వార్షికోత్సవం



అవార్డు అందుకుంటున్న సోమేపల్లి విశిష్ట

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 13 : పెన్నా రచయితల సంఘం (పెరసం) 15వ వార్షికోత్సవం శనివారం అట్టహాసంగా జరిగింది. స్థానిక టౌనుహాలు రీడింగ్ రూమ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో పెన్నా సాహిత్య పురస్కారం 'ఆకురాలిన చప్పు డు' కవితా సంపుటి రచించిన సోమేపల్లి వశిష్టకు అందజేసి సత్క రించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెన్‌కో విజిలెన్స్ విభాగం డీఎస్పీ శ్రీనివాసులు, తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ తెలుగు శాఖాధిపతి మేడిపల్లి రవికుమార్, 'ఆకురాలిన చప్పుడు' కవితా సంపుటిపై సమీక్షను కవి విమర్శకులు డాక్టర్ సుంకర గోపాల్ చేశారు. అనంతరం రచయిత అవ్వారు శ్రీధర్‌బాబు రచించిన 'సూర్యోదయం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నవలా రచయిత్రి డాక్టర్ సోమిరెడ్డి జయప్రద, పెరసం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.పెంచల నరసింహం, అధ్యక్షురాలు గోవిందరాజు సుభద్రాదేవి, కార్యదర్శి తోట సులోచన, కె.అంకబాబు, హస్తిలక్ష్మణ రాజు, కవితల పోటీకి న్యాయనిర్ణేతలుగా పెళ్లూరు సునీల్ వ్యవహరించారు. బుచ్చిలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు, రచయిత గండికోట సుధీర్‌కుమార్ తదితరులను సత్కరించారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న టీడీపీ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి

సైదాపురం, జూలై 13: ఎన్నికల్లో ఇచ్చిన మాటను వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ నిలబెట్టుకున్నారని మండల టీడీపీ అధ్యక్షుడు కట్టా మోహన్ కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం గిద్దలూరు, ఆదూరుపల్లి గ్రామాల మధ్య జరుగుతున్న రోడ్డు పనులను టీడీపీ నాయకులు పరిశీలించి మాట్లాడారు. బ్రిటీష్ కాలం దారి ఆక్రమణలకు గురైతే ఎమ్మెల్యే రామకృష్ణ అధికారులతో మాట్లాడి రోడ్డు నిర్మాణం పనులు చేపట్టడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ సభ్యుడు పాములూరు శ్రీనివాసులు నాయుడు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు కొల్లూరు వెంకటేశ్వర్లు రెడ్డి, వెంగల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఆనంను కలిసిన మెడికల్ సర్వీసెస్ నాయకులు

నెల్లూరు(హరనాథపురం) : రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని శనివారం ఆయన నివాసంలో ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు అధ్యక్షతన నాయకులు కలిశారు. వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని ఆమె నివాసంలో కలిసి సమస్యలు విన్నవించి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హంస నాయకులు ఎస్కే జలీల్ అహ్మద్, ఆనియాబేగం, సుమతి, అరుణరాణి, విజయబెనర్జీ, గౌస్‌బాషా, మాధవరావు, వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులు, రాజ్యలక్ష్మి, ప్రసాద్, వేణు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పాడి రైతులకు జొన్న విత్తనాల పంపిణీ

ఇందుకూరుపేట, జూలై 13: మండలంలోని పల్లెపాడు గాంధీ ఆశ్రమంలో పశుగ్రాస వారోత్సవాలలో భాగంగా శనివారం పాడి రైతులకు 75శాతం సబ్సిడీతో హైబ్రీడ్ జొన్న విత్తనాలు (సీఎస్‌హెచ్-24 ఎంఎఫ్) పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ డాక్టర్ వి కోటేశ్వరరావు పాల్గొని పశుసంవర్ధక శాఖలో వివిధ పథకాలు, పశువులు, గొర్రెలు, మేకలకు వేసే ఉచిత వ్యాక్సిన్ గురించి పాడి రైతులకు వివరించారు. అదేవిధంగా పశువుల్లో వచ్చు ముద్ద చర్మం వ్యాధికి ఈనెల 20 తేదీ నుంచి ఉచిత వ్యాక్సిన్ వేయనున్నట్లు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో ఇందుకూరుపేట ప్రాంతీయ వైద్యశాల ఏడీ డాక్టర్ బి మురళీకృష్ణ, ముదివర్తిపాలెం డాక్టర్ కె హరిబాబు, జే జస్వంత్ (పల్లిపాడు, ఏహెచ్‌ఏ) పశు సంవర్ధక శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆటోనగర్ ఏర్పాటుకు కృషి చేయాలి



ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని కలిసిన ఆటో మెకానిక్‌లు

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 13: మండలంలోని విలియమ్స్‌పేట (కొట్టాలు) వద్ద ఆటో నగర్ ఏర్పాటుకు కృషి చేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని స్థానిక ఆటో కార్మికులు కోరారు. శనివారం ఎమ్మెల్యే నివాసంలో ఆమెను ఆటో కార్మికులు కలి సి ఆటోనగర్ ఏర్పాటు గురి ంచి వివరించారు. బుచ్చిరెడ్డిపాళెంలో ట్రాఫిక్ నేపథ్యంలో రోడ్డు పక్కనే మెకానిక్ దుకాణాలు పెట్టుకుని మరమ్మ తులు, తదితర పనులు చేసుకోవడం కష్టతరంగా వుందన్నారు. అప్పట్లో కలెక్టర్‌కు విలియమ్స్‌పేటలోని భూమిని ఆటోనగర్ ఏర్పాటుకు అప్పగించాలని ఏపీఐఐసీ ఆదేశాలు జారీచేసినా గత ప్రభుత్వం హయాంలో ఆటోనగర్ అభివృద్ధికి ఒక్క అడుగు కూడా పడలేదని ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆటోనగర్ ఏర్పాటుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో సూరా శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యక్షుడు యజ్దానీబాష, పలువురు మెకానిక్‌లు వున్నారు.

పంచాయతీ వ్యవస్థను భ్రష్టు పట్టించిన వైసీపీ : జనసేన



నిర్మాణ దశలో ఉన్న వర్మి కంపోస్ట్ యూనిట్‌ను పరిశీలిస్తున్న జనసేన నేతలు

వెంకటాచలం, జూలై 13: గత వైసీపీ ప్రభుత్వం, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పంచాయతీ వ్యవస్థను భ్రష్టు పట్టించారని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు విమర్శించారు. మండలంలోని సర్వేపల్లిలో నిర్మాణ దశలో ఉన్న వర్మి కంపోస్ట్ యూనిట్ (చెత్త నుంచి సంపాద తయారుచేసే కేంద్రం)ని శనివారం జనసైనికులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో చెత్తనుంచి సంపాద తయారుచేసే కేంద్రాలను గాలికి వదిలేశారని విమర్శించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం గాడితప్పిన పంచాయతీ వ్యవస్థను గాడిలో పెట్టి పంచాయతీల అభివృద్ధికి శ్రీకారం చుట్టిందన్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సహకారంతో పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. సర్వేపల్లిలో సమస్యలను ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి సోమిరెడ్డితో కలిసి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గుమ్మినేని వాణిభవాని, పినిశెట్టి మల్లికార్జున్, శ్రీహరి, షేక్ రహీమ్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

సెబ్‌లో ఆ ముగ్గురి రూటే వేరు !



- నెల్లూరు రూరల్లో విచ్చలవిడిగా దండకాలు
- బెల్టుషాపు వద్ద రూ. 5 వేల చొప్పున మామూళ్లు
- ప్రైవేట్ వ్యక్తులతో కలసి దందా
- అన్నీ తెలిసి అధికారుల మౌనం

నెల్లూరురూరల్, జూలై 13: 'నువ్వు బెల్టు దుకాణం నడుపుతున్నట్లు సమాచారం వచ్చింది. స్టేషన్‌కు నడువు. అక్కడు నీ సంగతి చూస్తాం..! ఎన్నికలప్పుడు పెట్టినట్లు కేసులు పెడతాం.. లేదా మా సంగతేంటో చూసుకో..! అంటూ పాత బెల్టు దుకాణ దారులపై దౌర్జన్యం. ప్రైవేట్ వ్యక్తులను పంపి బెల్టు షాపులపై దాడి చేసి అక్కడికక్కడే రూ.10 వేలు వసూళ్లు..! ఇది ఒక ఎత్తు అయితే మీరు బెల్టు దుకాణం నడుపు కోండి... మాకు మాత్రం నెలనెలా రూ.5 వేలు ఇవ్వండి.. అంటూ అక్రమ మద్యం వ్యాపారానికి దారి చూపుతున్నారు. ఇదంతా నెల్లూరు రూరల్ సెబ్ (స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో) స్టేషన్ పరిధిలోని ముగ్గురు కానిస్టేబుళ్లు నిర్వహిస్తున్న దందా.

నెల్లూరురూరల్ పరిధిలోని కొండ్లపూడి, దేవరపాళెం, ఆమంచర్ల, కొత్తూరు, గుడిపల్లిపాడు, సౌత్‌మోపూరు, నవలాకులతోట, వడ్డిపాళెం, పార్థసారధి నగర్, రామకోటయ్య నగర్‌తోపాటు మరికొన్ని చోట్ల ప్రభుత్వ మద్యం షాపు లున్నాయి. వీటి ఆధారంగా సమీప ప్రాంతాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపులు నడుస్తున్నాయి. వీటి నిర్వాహకులు వద్దకు వెళ్తున్న రూరల్ సెబ్ స్టేషన్‌లోని ముగ్గురు కానిస్టేబుళ్ల నెలవారీ మామూళ్ల కింద రూ.5 వేలు వసూలు చేస్తున్నారు. ఇలా 18 గ్రామాల్లో ఒక్కొక్క గ్రామంలో కనీసం 5 బెల్టు షాపులున్నాయి. ఇక నగర పరిధి లోని ప్రాంతాల్లో లెక్కలేదు. వీరి నుంచి నెలకు రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారు. అలాగే ఈ ముగ్గురు పెన్నా పరివాహక ప్రాంతం నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల నుంచి విచ్చల విడిగా దండకాలకు దిగుతు న్నారు. ప్రస్తుతం ఇసుక ఉచితమైనా రూరల్లో అనుమతులు లేవంటూ సాకుగా చూపి దండకాలు చేస్తున్నారు.

విచారించిస్తా...

కానిస్టేబుళ్లు బెల్ట్ షాపుల వద్ద డబ్బులు వసూళ్లు చేస్తున్నారనే విషయం తెలియదు. అయినా విచారిస్తా. ఎవరైనా మా స్టేషన్ నుంచి డబ్బులు వసూళ్లకు పాల్పడితే నేరుగా నాకు ఫిర్యాదు చేయండి.

\- రాగమయి, సెబ్ - 2 (రూరల్) సీఐ

● బెల్టు అమ్మాలని బెదిరింపులు

గతంలో బెల్టు షాపులు నిర్వహిస్తూ కేసుల్లో ఇరుక్కుని, ప్రస్తుతం మద్యం వ్యాపారం జోలికి వెళ్లని వారికి ఫోన్లు చేసి మరీ బెల్టు షాపులు నిర్వహించాలని ఆదేశిస్తున్నారు. మీరు మద్యం అమ్ముకుని మాకు రూ.5 వేలు లంచం ఇస్తే సరిపోతుందని చెబుతున్నారు. ఓ దశలో వీరి బెదిరింపులు తాళలేక ఒకరిద్దరు వీరిపై ఫిర్యాదులు చేసేందుకు కూడా సిద్ధపడ్డారు.

● అధికారుల మౌనం

నెల్లూరు రూరల్ సెబ్‌స్టేషన్ కేంద్రంగా జోరుగా సాగుతున్న దండకాలపై ఆ శాఖ అధికారులు మౌనం వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మద్యం మాటున నిబంధనలు ఉల్లంఘన జరుగుతున్నా తమకేమి సంబంధం లేనట్టుగా వారు ఉంటున్నారు.

డీఆర్‌డీఏలో అవినీతిపై విచారణ జరపాలి

నెల్లూరు(వైద్యం), జూలై 13 : డీఆర్‌డీఏలో జరుగుతున్న అవినీతిపై విజిలెన్స్ విచారణ జరిపించాలని సీపీఐ జిల్లా నేత వాటంబేటి నాగేంద్ర డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో శ్రీనిధి కింద మహిళలకు స్వయం ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో పౌల్ట్రీ, గొర్రెల పెంపకంకు ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. చిన్నచిన్న కుటీర పరిశ్రమలకు యూనిట్ల ద్వారా డీఆర్‌డీఏకు నిధులు పంపిస్తే పొదుపు మహిళలకు ఆయా యూనిట్లకు నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఈ యూనిట్లలో రాపూరు మండలానికి సంబంధించి దాదాపు 50 మంది మహిళలకు గొర్రెల యూనిట్ల పేరుతో ఓ వ్యక్తి ఎలాంటి పత్రాలు లేకుండా రూ.25 లక్షలు డ్రా చేశారని విమర్శించారు. ఈ పరిస్థితిలో పొదుపు మహిళలను సంప్రదించగా అసలు విషయం బయట పడిందని చెప్పారు. ఈ అవినీతి బాగోతంపై విచారణ జరిపించాలని డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు లీలామోహన్, శ్రీనివాసులు, లక్ష్మయ్య, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బీచ్ కబడ్డీ పోటీల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

నెల్లూరు(విద్య), జూలై 13 : ఇందుకూరుపేట ఎంకేఆర్ పాఠశాల క్రీడామైదానంలో ఆగస్టు 2 నుంచి 4వ తేదీ వరకు జరిగే మహాలక్ష్మీ మెమోరియల్ 11వ ఆంధ్ర రాష్ట్ర బీచ్ కబడ్డీ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆవిష్కరించారు. నగరంలోని తన నివాసంలో శనివారం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆమె పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఇందుకూరుపేటలో ఆంధ్ర రాష్ట్ర బీచ్ కబడ్డీ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీల్లో క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి ఉత్తమంగా రాణించాలని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్, నిర్వాహక కార్యదర్శి దాసరి విజయకుమార్, సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి ఆనంను కలిసిన ప్రశాంతిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం) : రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శనివారం నగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం, వినాయక ప్రతిమలను అందచేశారు. ఈ సందర్భంగా కోవూరు నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధి గురించి ఆనంతో చర్చించారు.

పెండింగ్‌లో ఉన్న పనులన్నీ పూర్తి చేయాలి

● నీటిపారుదల శాఖ అధికారులతో సోమిరెడ్డి సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న సోమిరెడ్డి

నెల్లూరు(వైద్యం), జూలై 13 : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పనులన్నింటిని పూర్తి చేయాలని మాజీ మంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని నీటి పారుదల శాఖ కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్షించారు. సర్వేపల్లి నియోజకవర్గం పరిధిలో అన్ని పెండింగ్ పనులను పూర్తి చేయాలని కోరారు. రైతుల అవసరాలకు అత్యవసరంగా చేపట్టాల్సిన పనులపై అధికారులతో పాటు మండలాల నేతలతోనూ చర్చించారు. అలాగే ఆదివారం రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు పర్యటన ఉన్న నేపథ్యంలో ఈ పెండింగ్ ప్రాజెక్టుల పనులన్నింటిపై మంత్రితో చర్చించాలని తెలియచేశారు.

ప్రభుత్వ కార్యాలయాలకు చంద్రబాబు ఫొటోల బహూకరణ



చంద్రబాబు ఫొటోను అందజేస్తున్న పోలూరు సుబ్బయ్య

నెల్లూరురూరల్, జూలై 13 : రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో అల్లీపురంలోని ప్రభుత్వ కార్యాలయాలకు పీఎం నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ల ఫొటోలను టీడీపీ సీనియర్ నేత పోలూరు సుబ్బయ్య అందచేశారు. ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ చిత్రపటాలను బహూకరించారు. ఏపీలో కూటమి ప్రభుత్వంతో పేదలందరికీ మంచి జరుగుతుందని, ఎన్నడూ అందని సంక్షేమం నిరుపేదలకు త్వరలో దగ్గర కానున్నదన్నారు. ప్రభుత్వ కార్యాలయాల వేదికగా ప్రజలకు చక్కటి పాలన చేరువవుతుందని తెలిపారు.

చదువుతోనే ఉన్నత స్థానం

● 215 మందికి ప్రతిభా పురస్కారాలు



శాలివాహన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న రాష్ట్ర నాయకులు

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 13 : చదువుతోనే సమాజంలో ఉన్నత స్థానం పొందుతారని కుమ్మర, శాలివాహన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఐలాపురం భాస్కర శ్రీనివాసులు తెలిపారు. శనివారం 31వ డివిజన్ కొత్తూరు శాలివాహన సంఘం కళ్యాణ మండపంలో జిల్లా అధ్యక్షుడు కెఎస్.నరసయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 10, ఇంటర్‌లో 75 శాతం మార్కులు సాధించిన శాలివాహన విద్యార్థులు 215 మందికి ఒక్కొక్కరికి రూ.2వేలు, సర్టిఫికెట్స్, మెమెంటోలు ప్రదానం చేశారు. కృష్ణా జిల్లా అధ్యక్షుడు బొమ్మిన శ్రీనివా సులు, నాయకులు ఐలాపురం రాజ, మొగిలచర్ల సుబ్బారావు, అద్దంకి సుబ్బారావులు మొదటి బహుమతి వచ్చిన విద్యార్థికి గోల్డు కాయన్ అందజేశారు. ద్వితీయ, తృతీయ బహుమతులు వచ్చిన వారికి బుచ్చిరెడ్డిపాలెం మండల శాఖ రూ.4వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పెళ్లూరు శ్రీనివాసులు, తలిగొండ వెంకటేశ్వర్లు, మాల్యాద్రి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఆక్రమణల తొలగింపు

- నెల్లూరు చెరువులో విచ్చలవిడిగా ప్లాట్లు
- ఇరిగేషన్, వైసీపీ కలిసి దందా

నెల్లూరురూరల్, జూలై 13 : వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నన్నాళ్లు సహజవనరులన్నింటిని దోచుకోవడమే ధ్యేయంగా పాలన సాగించారు. ఇందులో భాగంగా నెల్లూరు నగర పరిధిలోని లేక్వ్యూ కాలనీ వద్ద నెల్లూరు చెరువు పోరంబోకు స్థలాలను ఆక్రమించిన వైసీపీ నాయకులు ఇరిగేషన్ అధికారుల సహాయంతో భారీగా ప్లాట్ల నిర్మాణం చేసి వాటిని అమ్మేసి సొమ్ము చేసుకున్నారు. ఇంతలో ప్రభుత్వం మారడంతో రంగంలోకి దిగిన అధికారుల కమిటీ ఆక్రమణలను తొలగించింది. పొదలకూరు రోడ్డు లేక్వ్యూ కాలనీ 1 నుంచి 15వ వీధి వరకు నెల్లూరు చెరువు సమీప ప్రాంతాన్ని ఆక్రమించి చెరువులో మట్టితో ప్లాట్ల నిర్మాణం చేశారు. వీటిని అమ్మకాలు చేపట్టిన వైసీపీ నాయకులు భారీగా సొమ్ము చేసుకోవడంతో స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదులకు స్పందించిన నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు, కార్పొరేషన్ అధికారులతో కూడిన కమిటీ ఏర్పాటు చేసి చెరువులోని ఆక్రమలను తొలగించాలని సూచించిడంతో శనివారం రంగంలోకి దిగిన కమిటీ కబ్జాకు విముక్తి కల్పించారు. ఇక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

నెల్లూరు(విద్య): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి ఎస్.తిరుమలయ్య కోరారు. విజయవాడలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తల్లికి వందనం పథకాన్ని కేవలం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే ఇవ్వాలన్నారు. హై స్కూల్ ప్లస్‌లో ఉపాధ్యాయుల కొరత ఉందని, వెంటనే ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. అలాగే ఉద్యోగులకు కనీసం 20శాతం తగ్గకుండా మధ్యంతర భృతి ఇవ్వాలని, ఉపాధ్యాయుల సర్దుబాటు వెంటనే చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నేతలు వెంకటరాజు, నాగేంద్రకుమార్, నాగిరెడ్డి, శ్రీనివాసులు, సైమన్‌కుమార్, సుబ్బారావు, చెన్నయ్య పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

నెల్లూరురూరల్, జూలై 13 : నెల్లూరురూరల్ నియోజకవర్గ పరిధిలోని 28వ డివిజన్‌లో శనివారం మినరల్ వాటర్ ప్లాంటును టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ప్రారంభించారు. డివిజన్‌లోని ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. కనీస మౌలిక వసతుల్లో భాగంగా తాగునీరు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చక్కా అహల్య, మాజీ మేయర్ భానుశ్రీ, నాయకులు సునీల్, రాజానాయుడు పాల్గొన్నారు.

సంగీత పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 13 : ఎస్వీ బాలసుబ్రహ్మణ్యం ప్రభుత్వం సంగీత కళాశాలలో 2024-25 సంవత్సరానికి సంగీతం, వాయిద్యం నృత్యం కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి ఒక ప్రకటనలో తెలిపారు. 2024 జూలై 1వ తేదీకి 10 ఏళ్లు నిండిన విద్యార్థులతో పాటు గృహిణులు, ఉద్యోగులు ఆగస్టు 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్ రోటరీ ఆడిటోరియం వద్ద గల తమ పాఠశాలలో రూ.50 చెల్లించి దరఖాస్తులు తీసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 0861-2328 285, 90007 86599ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరురూరల్, జూలై 13 : హత్య కేసులో నిందితుడిని రూరల్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. అందిన సమాచారం మేరకు... గత నెల 30న చింతారెడ్డిపాళెం వద్ద ఓ ఆసుపత్రిలో పెయింటింగ్ పనులు నిమిత్తం వచ్చిన యూపీకి చెందిన రవిగౌర్ (27), లాల్‌మోహన్‌ల మధ్య ఘర్షణ జరిగింది. ఇద్దరు మద్యం సేవించి ఉండటంతో లాల్‌మోహన్ కత్తితో రవిగౌర్‌పై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో రవిగౌర్ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా అప్పటి నుంచి పరారీలో ఉన్న లాల్‌మోహన్‌ను అరెస్టు చేశారు.

'మెడికవర్'లో అరుదైన కీ హోల్ సర్జరీ

నెల్లూరు(వైద్యం): నగరంలోని మెడికవర్ ఆసుపత్రిలో ఓ వ్యాధిగ్రస్తుడికి అరుదైన కీ హోల్ సర్జరీని వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో శనివారం ఆసుపత్రిలో నిర్వహించిన సమావేశంలో ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ గంగపట్నం దినేష్ మాట్లాడారు. జిల్లాలోని ఊటుకూరు కంచర్లపాళెంకు చెందిన ప్రదీప్ తాటి చెట్టుపై నుంచి కింద పడటంతో పక్కటెముక, వెన్నుముక దెబ్బతిందన్నారు. దీంతో పూర్తిస్థాయి పరీక్ష నిర్వహించి కీ హోల్ సర్జరీ ద్వారా లోపల ఉన్న కండరాలకు ఇబ్బంది కలిగించకుండా ఎముకకు రాడ్‌లు వేశామన్నారు. ప్రస్తుతం బాధితుడ్ని డిశ్చార్జ్ చేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో బాధితుడితో పాటు ఆయన భార్య మాధవి పాల్గొన్నారు.

సమన్యాయం.. మన విధానం

బాధితులకు అండగా నిలవండన్న డీజీపీ ద్వారకా తిరుమలరావు


తిరుపతిలో ఎస్పీలతో సమావేశమైన డీజీపీ

తిరుపతి (నేరవిభాగం), జూలై 13 : 'పోలీసుల పని విధానం మారాలి. గతంలో చాలామందిపై పిర్యాదులొచ్చాయి. మానవ హక్కులు ఉల్లంఘించి, చట్టాలను చేతిలోకి తీసుకుని పనిచేసిన వారు ఇక మారాలి. లేకుంటే వారు తప్పుకోవచ్చు...మళ్ళీ మళ్ళీ అదే విధానాలు అమలుచేయాలంటే నా దగ్గర కుదరదు...ఎవరు తప్పు చేసినా అందరికీ సమన్యాయం అనే విధానం మరచిపోవద్దు' అని డీజీపీ ద్వారకా తిరుమలరావు చెప్పారు. శాంతి భద్రతలు, నేరాల అదుపు, ప్రస్తుతం పోలీసు అధికారుల పనితీరు వంటి అంశాలపై రాయలసీమ పరిధిలోని జిల్లాల ఎస్పీలు, డీఐజీ షెముషి బాజ్పేయితో శనివారం తిరుపతిలో డీజీపీ సమీక్షించారు. ప్రధానంగా కొత్త ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా పనిచేసి బాధితులకు తక్షణం న్యాయం చేయాలని ఆదేశించారు.చట్టాలను చేతిలోకి తీసుకుని మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడితే మాత్రం ఎవరైనా చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. బాధితులు, ఫిర్యాదుదారులు స్టేషన్లకు వచ్చినప్పుడు వారితో నవ్వుతూ, స్నేహపూర్వక వాతావరణంతో మాట్లాడాలని కోరారు. తిరుపతిలో ఎన్నికలకు ముందు, కౌంటింగ్ అనంతరం జరిగిన కొన్ని కేసులను ఉదహరిస్తూ ఇలాంటి తప్పుడు కేసులు పెడితే మాత్రం సంబంధిత అధికారులపై చర్యలు వుంటాయన్నారు. ప్రస్తుతం తిరుపతిలో నేరాలు, ఎర్రచందనం అక్రమ రవాణా కొంతవరకు తగ్గుముఖం పట్టాయంటూ ఎస్పీ హర్షవర్ధన రాజు క్షేత్రస్థాయి పర్యటన చేస్తున్న విధానంపై డీజీపీ అభినందించారు.తిరుపతిలో గంజాయి విక్రయాలు ఎక్కువగా వున్నాయని, వాటిని అరికట్టాలన్నారు.గంజాయి సేకరణ,రవాణా, విక్రయాలపై గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. పాత కేసులు, ఎన్నికల సందర్భంగా నమోదైన కేసులు, గత ప్రభుత్వంలో అధికారపార్టీతో అంటకాగిన అధికారుల పనితీరుపై ఆయన సమీక్షించారు.ఎస్పీలు హర్షవర్ధన రాజు, కృష్ణారావు, కృష్ణకాంత్, సిద్ధార్థకౌశల్, మాధవ రెడ్డి, మణికంఠ చందోలు, గౌతమి శాలి, తిరుపతి అదనపు ఎస్పీలు వెంకట్రావు, కులశేఖర్ పాల్గొన్నారు.

ఎస్పీగా సుబ్బరాయుడు

హర్షవర్ధన రాజు కడపకు బదిలీ


ఎల్. సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), జూలై 13 : తిరుపతి జిల్లాకు ఎస్పీగా ఎల్. సుబ్బరాయుడు నియమితులయ్యారు. అనంతపురం జిల్లా బండమీదపల్లెకు చెందిన సుబ్బరాయుడు 2007లో డీఎస్పీగా పోలీసు శాఖలో అడుగుపెట్టారు. ప్రకాశం జిల్లా మార్కాపురం, ఏలూరుల్లో డీఎస్పీగా పనిచేసిన తర్వాత నిజామాబాద్, అనంతపురం ,కరీంనగర్ జిల్లాల్లో అదనపు ఎస్పీగా పనిచేశారు. 2013లో ఐపీఎస్ హోదా లభించింది. అనంతరం ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి గవర్నర్ వద్ద సీఎస్ఓగా పనిచేశారు.2014 నుంచి 2019 వరకు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద చీఫ్ సెక్యూరిటీ అధికారిగా పనిచేసి మంచి అనుభవం గడించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారాక తెలంగాణా క్యాడర్‌కు బదిలీపై వెళ్ళారు. అక్కడ సీఐడీలో ఎస్పీగా పనిచేశారు.2023లో కరీంనగర్ పోలీసు కమిషనర్‌గా పనిచేసిన ఆయన్ను ఎన్నికల సమయంలో డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. అనంతరం తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఆయన్ను హైదరాబాదు ట్రాఫిక్ డీసీపీగా నియమించారు. అక్కడ పనిచేస్తూ ఏపీకి డిప్యుటేషన్‌పై రావడానికి దరఖాస్తు చేసుకున్నారు. వారం రోజుల క్రితం ఏపీకి ఇంటర్ క్యాడర్ బదిలీపై వచ్చిన సుబ్బరాయుడు తాజాగా తిరుపతి జిల్లాకు ఎస్పీగా నియమితులయ్యారు.అలాగే ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ ఎస్పీగా సుబ్బరాయుడికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక్కడి ఎస్పీ హర్షవర్ధన రాజును కడపకు బదిలీ చేశారు.ఆయన ఇక్కడ పని చేసిన రెండు నెలల వ్యవధిలోనే పోలీసు శాఖను గాడిలో పెట్టడానికి కృషి చేశారు. పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారు. ట్రాఫిక్ నియంత్రణతో పాటు బహిరంగ ప్రదేశాల్లో మద్యసేవనాన్ని అరికట్టేందుకు ప్రయత్నించారు.

టీటీడీ సీవీఎస్వో బదిలీ


నరసింహకిషోర్

తిరుమల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ముఖ్య నిఘా, భద్రతాధికారి(సీవీఎస్వో) డి.నరసింహకిషోర్ బదిలీ అయ్యారు. 2022 ఏప్రిల్ 6వ తేదీన బాధ్యతలు స్వీకరించిన నరసింహకిషోర్ రెండేళ్ల మూడునెలల పాటు టీటీడీలో పనిచేశారు.తూర్పు గోదావరి జిల్లాకు ఆయన్ను బదిలీ చేశారు. అయితే ఈ పోస్టులో ఎవరినీ నియమించలేదు. తిరుమలలో భద్రతావైఫల్యంపై ఈ రెండేళ్లలో తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. ఇందులో ప్రధానంగా టీటీడీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఓ డ్రోన్ కెమెరా నేరుగా ఆలయంపైకే వెళ్లడం కలకలం సృష్టించింది. గత ఏడాది జనవరిలో అఖిలాండం నుంచి శ్రీవారి ఆనందనిలయం వరకు తీసిన డ్రోన్ విజువల్స్ సోషల్ మీడియాలో ప్రత్యక్షమైన విషయం తెలిసిందే. సర్వే కోసమని ఓ సంస్థకు అనుమతి ఇచ్చి పర్యవేక్షణను గాలికొదిలేయడంతో ఆ సంస్థ ఉద్యోగి డ్రోన్ ద్వారా వీడియో తీసి నెట్‌లో అప్‌లోడ్ చేశాడు. అలాగే గత ఏడాది మే నెలలో ఓ యువకుడు భద్రతాతనిఖీలు దాటుకుని ఆలయంలోకి వెళ్లి ఆనంద నిలయం వీడియోను తీసి సోషల్‌మీడియాలో పెట్టాడు. ఈ ఏడాది కూడా ఓ జంట డ్రోన్ కెమెరాలతో తిరుమలకు రావడమే కాకుండా ఘాట్‌రోడ్డులో వీడియోను తీయడం కూడా విమర్శలకు దారితీసింది. మరోవైపు గతంలో ఎన్నడూ లేనివిధంగా తిరుమలలో గంజాయి పట్టుబడటం కూడా అందరినీ ఆశ్చర్యపరిచింది.తిరుమలలో నిషేధించిన మద్యం, మాంసం, పొగాకు ఉత్పత్తులు కూడా తరచూ దర్శనమిచ్చాయి. ఈ పరిస్థితుల్లో తిరుమలలో భద్రతను మరింత పటిష్టం చేయడంలో భాగంగా ఎవరిని సీవీఎస్వోగా నియమిస్తారనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది.

నానీపై దాడి కేసులోనూ సక్రమంగా సాగని దర్యాప్తు

పోలింగు మరుసటిరోజు చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై తిరుపతిలోని మహిళా వర్శిటీ ఆవరణలో జరిగిన హత్యాయత్నానికి సంబంధించిన కేసులో దర్యాప్తు సక్రమంగా సాగడం లేదు. ప్రధాన పార్టీ అభ్యర్థిపై హత్యాయత్నం జరగడం, అది కూడా ఈవీఎంలు భద్రపరిచిన మహిళా వర్శిటీ ఆవరణలో జరగడం ప్రభుత్వ యంత్రాంగాన్ని కుదిపివేసింది.జిల్లా యంత్రాంగం, పోలీసు యంత్రాంగాల వైఫల్యాన్ని బట్టబయలు చేసిన ఈ ఘటనలో తర్వాత కూడా దర్యాప్తు సజావుగా సాగలేదు. సరికదా టీడీపీ నేతలపై ఎదురు కేసులు బనాయించారు. నానీపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన వారంటూ పోలీసులు అరెస్టు చేసిన వారిలో పలువురు అమాయకులని, ఘటనతో ఎలాంటి సంబంధం లేనివారన్న ఆరోపణలున్నాయి. కేవలం ఘటన తీవ్రత తగ్గించేందుకు అప్పటికప్పుడు కేసుతో సంబంధం లేని వారిని నిందితులుగా చూపి అరెస్టు చేశారన్న ఆరోపణలున్నాయి. కీలక నిందితులను పోలీసు కస్టడీకి తీసుకుని విచారించడంతో పాటు కేసును సైంటిఫిక్‌గా దర్యాప్తు సాగిస్తే హత్యాయత్నం చేయించిన కీలక వ్యక్తులు ఎవరన్నది తెలుతుంది. అయితే పోలీసులు ఆ దిశగా ఇప్పటి వరకూ చర్యలు తీసుకోవడం లేదు.తిరుపతి పర్యటనలో వున్న డీజీపీ ద్వారకా తిరుమల రావు వీటన్నింటిపై దృష్టి సారించి జిల్లా పోలీసు యంత్రాంగానికి దిశా నిర్దేశం చేయాల్సిన అవసరముంది.


మే 14న మహిళావర్సిటీ వద్ద వైసీపీ శ్రేణుల దాడితో గాయపడ్డ నానికి సపర్యలు

డీజీపీగారూ... దృష్టి పెట్టాలి మీరు

ఐదేళ్లలో టీడీపీ నేతలపై అసంఖ్యాక తప్పుడు కేసులు - వైసీపీ నేతల ప్రమేయమున్న కేసుల్లో సాగని దర్యాప్తు

గడచిన ఐదేళ్ళ పాటు జిల్లావ్యాప్తంగా టీడీపీ, జనసేన పార్టీల నాయకులపై వైసీపీ నేతల ఒత్తిడితో పోలీసులు అసంఖ్యాకంగా తప్పుడు కేసులు నమోదు చేశారు.ప్రభుత్వానికి, వైసీపీ నేతలకు వ్యతిరేకంగా నోరెత్తిన, రోడ్డెక్కిన వారందరిపైనా క్రిమినల్ కేసులు బనాయించారు. సామాన్య కార్యకర్తల నుంచీ నియోజకవర్గాల ఇంఛార్జుల వరకూ అన్ని స్థాయిల్లోనూ టీడీపీ, జనసేన క్యాడర్ వేధింపులను, తప్పుడు కేసులను ఎదుర్కొంది. ప్రభుత్వం మారిన నేపథ్యంలో అన్యాయంగా కేసుల పాలైన తమకు న్యాయం చేయాలని టీడీపీ, జనసేన నేతలు కోరుతున్నారు.డీజీపీ ద్వారకా తిరుమల రావు తిరుపతికి వచ్చిన నేపథ్యంలో నాటి అధికార పార్టీ నేతలు, పోలీసుల చేతిలో బాధితులు ఎదుర్కొన్న వేధింపులు, కేసులకు సంబంధించి కొన్ని ఆయన దృష్టికి తీసుకుపోయే ప్రయత్నమిది....

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

వెంకటగిరిలో రామకృష్ణపై నాలుగు కేసులు

వెంకటగిరి టీడీపీ ఇంఛార్జి కురుగొండ్ల రామకృష్ణ, ఇదే నియోజకవర్గానికి చెందిన తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్‌లపై నాలుగు కేసులు బనాయించారు. 2021 డిసెంబరు 1న కరోనా నిబంధనలను నిరసిస్తూ ధర్నా చేసినందుకు వీరిపై కేసు నమోదు చేయగా 2021 డిసెంబరు 6న అమరావతి రైతుల పాదయాత్ర సందర్భంగానూ నిబంధనలు ఉల్లంఘించారంటూ కేసు పెట్టారు. 2023 ఆగస్టు 4న అంగళ్ళలో చంద్రబాబుపై దాడికి నిరసనగా జగన్ దిష్టిబొమ్మ కాల్చినందుకు కూడా వీరిద్దరిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ ఏడాది జనవరి 19న రా కదలిరా చంద్రబాబు పర్యటనలో కూడా నిబంధనల ఉల్లంఘన పేరుతో క్రిమినల్ కేసు రిజిస్టర్ చేశారు.

సోషల్ మీడియాలో పోస్టు షేర్ చేశారంటూ...

వెంకటగిరి నియోజకవర్గంలో తెలుగు యువత కార్యదర్శి ఆవుల మురళిపై పోలీసులు కేసు బనాయించారు. 2023 ఏప్రిల్‌లో సోషల్ మీడియాలో వైసీపీకి వ్యతిరేకంగా ఒక పోస్టును షేర్ చేయడమే నేరంగా అదే నెల 5న క్రైమ్ నంబరు 35-2023. పేరిట కేసు నమోదు చేశారు.

చిల్లకూరులో టీడీపీ నేతపై రెండు కేసులు

చిల్లకూరు మండలం తిప్పగుంటపాలేనికి చెందిన టీడీపీ మండల అధ్యక్షుడు ఉచ్చూరు వెంకటేశ్వర్లు రెడ్డిపై ఓ వ్యక్తిని బెదిరించాడని కేసు నమోదైంది. అలాగే ఓ మహిళను కులం పేరిట దూషించారంటూ మరో కేసు కూడా నమోదైంది. ఈ రెండు కేసులు కూడా 2021 మార్చిలో తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల సమయంలో వెంకటేశ్వర్లు రెడ్డి టీడీపీ వైపు చురుగ్గా పనిచేస్తున్న సందర్భంలో అధికార పార్టీ నేతల ఒత్తిడితో నమోదయ్యాయి.

టీడీపీ నేతపై తల్లీ, తోబుట్టువులతోనే కేసు

బాలాయపల్లి మండలం గాజులపల్లిలో మండల తెలుగు యువత అధ్యక్షుడు గోవర్ధనకు తల్లి, తోబుట్టువులతో కుటుంబ కలహాలున్నాయి. దాన్ని ఆసరాగా తీసుకుని 2023లో అధికార పార్టీ నేతలు అతనికి వ్యతిరేకంగా కుటుంబ సభ్యులను ఉసిగొల్పి తప్పుడు కేసు నమోదు చేయించారు.


మహిళా వర్సిటీ వద్ద వైసీపీ శ్రేణుల దాడిలో గాయపడ్డ నానీ గన్‌మెన్ ధరణి (ఫైల్‌ఫొటో)

ఎపిక్ కార్డుల అక్రమ డౌన్‌లోడ్ కేసులోనూ సాగదీతే!

తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల సందర్భంగా తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో 2021 ఫిబ్రవరి, మార్చి నెలల్లో భారీ ఎత్తున ఓటరు కార్డులను అక్రమంగా డౌన్‌లోడ్ చేసిన సంగతి తెలిసిందే. మున్సిపల్ కార్యాలయం, తిరుపతి అర్బన్ తహసిల్దారు కార్యాలయాలు వేదికగా ఈ అక్రమాలు జరిగాయి. అప్పటి అధికార పార్టీ ముఖ్యనేతల ఆదేశాలతో మున్సిపల్, రెవిన్యూ అధికారులు, ఉద్యోగులు 35 వేల ఎపిక్ కార్డులను అక్రమంగా డౌన్ లోడ్ చేసినట్టు సాక్షాత్తూ ఎన్నికల కమిషన్ పరిశీలనలో వెల్లడైంది. ఈ ఘటనకు బాధ్యులుగా అప్పటి మున్సిపల్ కమిషనర్ గిరిశా, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, అర్బన్ తహసిల్దారు, డిప్యూటీ తహసిల్దార్‌లను సస్పెండ్ చేశారు. పోలింగ్ రోజు విపక్షాలు చేసిన ఫిర్యాదులపై బోగస్ ఓటర్ల విషయంలో తగిన విధంగా కేసులు పెట్టలేదని, పెట్టిన కేసుల్లో దర్యాప్తు సక్రమంగా చేపట్టలేదని ఆరోపిస్తూ ఇద్దరు సీఐలు, ఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్‌లను కూడా సస్పెండ్ చేశారు. దీనిపై ఈసీ ఆదేశాలతో పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. తిరుపతికి చెందిన వైసీపీ కీలక నేతల ఆదేశాలతోనే ఎపిక్ కార్డులు డౌన్‌లోడ్ చేశారన్న ఆరోపణలు వున్నాయి. వ్యవహారం జరిగిన కంప్యూటర్ల హార్డ్ డిస్కులను పోలీసులు స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. ల్యాబ్ నుంచీ నివేదిక కూడా వచ్చినట్టు చెబుతున్నారు. అయితే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు గాలికొదిలేశారన్న విమర్శలున్నాయి. వేగంగా, సక్రమంగా దర్యాప్తు జరిగివుంటే ఇప్పటికే తిరుపతి వైసీపీ కీలక నేతలు నిందితులుగా మారి వుండేవారని, అయితే వారిని కాపాడేందుకే పోలీసు అధికారులు దర్యాప్తు చేపట్టకుండా కాలక్షేపం చేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది.

కబ్జా అయిన భూమిని పరిశీలిస్తే...

రేణిగుంట మండలం అన్నాసామిపల్లిలో ప్రభుత్వ భూములను వైసీపీ నేతలు కబ్జా చేశారన్న ఆరోపణల నేపథ్యంలో భూములు పరిశీలించేందుకు టీడీపీ నేతలతో కలసి వెళ్ళిన శ్రీకాళహస్తి టీడీపీ ఇంఛార్జి బొజ్జల సుధీర్‌రెడ్డిపై కేసు నమోదైంది. అనుమతి లేకుండా భూమిలో ప్రవేశించి మొక్కలు పెరికేశారని, సెక్యూరిటీ గార్డును బెదిరించారంటూ పోలీసులు కేసు పెట్టారు. అదొక్కటే కాదు వైసీపీ నాయకుల అరాచకాలకు వ్యతిరేకంగా రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ ఎదుట నిరసనగా బైఠాయించిన బొజ్జల సుధీర్‌రెడ్డిపై హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాల కింద కేసు పెట్టారు.శ్రీకాళహస్తి మండలం కమ్మకొత్తూరులో కొంతమంది టీడీపీ సానుభూతిపరులను వేధిస్తున్నారని సీఐని సుధీర్‌రెడ్డి అడిగినందుకు దుర్భాషలాడడంతో శ్రీకాళహస్తి రూరల్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు.దీంతో స్టేషన్‌పై, పోలీసులపై దాడికి ప్రయత్నించినట్లు ఓ కేసు , మరో అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

వదిలిపెట్టాలని వాదిస్తే దాడి కేసు

చంద్రబాబు అరెస్టు సందర్భంగా టీడీపీ నాయకులను ముందు జాగ్రత్త చర్యగా శ్రీకాళహస్తి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాత్రయినా విడిచిపెట్టకపోవడంతో టీడీపీ నాయకులు తమను ఎందుకు వదిలిపెట్టడం లేదంటూ వాగ్వాదానికి దిగారు. దీంతో తమపై దాడి చేశారంటూ పోలీసులు ఎనిమిదిమంది టీడీపీ నాయకులపై క్రిమినల్ కేసు నమోదు చేశారు.


శ్రీకాళహస్తి రూరల్ స్టేషన్ ఎదుట బొజ్జల సుధీర్‌రెడ్డి ధర్నా (ఫైల్‌ఫొటో)

పోలింగ్ బూత్‌లో అక్రమ ప్రవేశాన్ని అడ్డుకున్నందుకు...

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏర్పేడు పోలింగ్ బూతుల్లోకి ప్రవేశించిన వైసీపీ నాయకులను అడ్డుకున్న టీడీపీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారు. ఘటన జరిగినపుడు అక్కడ లేని వారిపైనా కేసులు పెట్టారు.

లోకేశ్ బ్యానర్లు కట్టినందుకు కేసు

నారా లోకేష్ పాదయాత్ర సందర్భంగా ఏర్పేడు మండలంలో బ్యానర్లు, పోస్టర్లు వేసిన పలువురు టీడీపీ నాయకులపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

వైసీపీ నేతల ప్రమేయమున్న కీలక కేసుల్లో సాగని దర్యాప్తు

జిల్లావ్యాప్తంగా టీడీపీ నాయకులను, కార్యకర్తలను తప్పుడు కేసులతో వేధించిన పోలీసులు అదే సమయంలో వైసీపీ నేతల ప్రమేయమున్న కీలక కేసుల్లో మాత్రం దర్యాప్తు సక్రమంగా చేపట్టలేదు. సాగదీత ధోరణితో వ్యవహరించారు. ఉదాహరణకు శ్రీకాళహస్తి ఎన్టీయార్ కూడలిలో 2022 జూన్‌లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు వాహనంపై వైసీపీ నాయకులు రాళ్ళతో దాడి చేశారు. వాహనం నుంచీ కిందకు దిగిన చలపతి నాయుడుపై వైసీపీ నేత, అప్పటి ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుడు బుల్లెట్ జై శ్యామ్ దాడి చేసి గాయపరిచాడు. దీనిపై ఫిర్యాదు చేయగా పోలీసులు సక్రమంగా దర్యాప్తు చేయలేదు. ఆ కేసు దర్యాప్తు అతీగతీ లేకుండా పోయింది.

మిల్లర్‌లో పడి మహిళ దుర్మరణం


ఇందిరమ్మ (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, జూలై 13 : భవన నిర్మాణ పనులకెళ్లిన ఓ మహిళ మిల్లర్‌లో చీర ఇరుక్కుని ప్రాణాలు కోల్పోయిన విషాద వుదంతమిది. పోలీసుల కథనం ప్రకారం...చిట్టమూరు మండలం కుమ్మరిపాలెంకు చెందిన ఎర్రబోతు ఇందిరమ్మ (45) శనివారం సూళ్లూరుపేట రైల్వేస్టేషన్ రోడ్డులో ఓ భవన నిర్మాణానికి శ్లాబ్ పనికి వెళ్లింది. మిల్లర్‌లో సిమెంట్ కలవ కలుపుతుండగా పక్కనే ఆమె నీటితో చేతులను శుభ్రం చేసుకుంటోంది. ఇదే సమయంలో ఇందిరమ్మ చీర మిల్లర్‌కు తగులుకుంది. మిల్లర్ వెంటనే లాక్కోవడంతో ఆమె అందులో ఇరుక్కుపోయింది.తల మొండెం నుంచి తెగి పడిపోయింది. వెంటనే మిల్లర్‌ను నిలిపివేసి తోటి కూలీలు ఆమె మృతదేహాన్ని బయటకు తీశారు. ఎస్ఐ రహీం రెడ్డి ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మిల్లర్‌లో ఇరుక్కున్న మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రహీం రెడ్డి

శ్రీవారి ఆలయంలో 16న వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు

తిరుమల, జూలై13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 16న వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేశారు. 16వ తేదీన ఆలయంలో ఆణివార ఆస్థానం నిర్వహించనున్నారు. ఈక్రమంలో సామాన్య భక్తులకు ఇబ్బంది లేకుండా వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేయాలని టీటీడీ నిర్ణయించింది. దీంతో వీఐపీ బ్రేక్ దర్శనాలకు 15వ తేదీన ఎలాంటి సిఫార్సు లేఖలను స్వీకరించబోమని టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు: కురుగొండ్ల



వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణ

వెంకటగిరి, జూలై 13: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సూచించారు. శనివారం ఆయన వెంకటగిరి, బాలాయపల్లి వైద్యశాఖ అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ఆసుపత్రులకు వచ్చే రోగుల నుంచి ఫిర్యాదు అందితే వెంటనే స్పందిస్తామన్నారు. సమయపాలన పాటించాలన్నారు. ఆసుపత్రుల సమస్యలు, అవసరమైన పరికరాలు, మందుల సరఫరా, సిబ్బంది కొరత తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే చెప్పారు.

సెలవు రోజుల్లో తరగతుల నిర్వహణ తగదు

గూడూరు అర్బన్, జూలై 13: నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకుడు చిన్నా కోరారు. స్థానిక ఏబీవీపీ కార్యాలయంలో శనివారం సమావేశంలో మాట్లాడుతూ పట్టణంలోని పలు ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు సెలవు దినాలలో తరగతులను నిర్వహిస్తూ నిబంధనలను పాటించడంలేదన్నారు. దీనివల్ల విద్యార్థులు ఒత్తిడికి లోనవుతున్నారన్నారు. అధికారులు స్పందించి విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జయకృష్ణ, శివ, లోకేష్, నజీర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చిన్న

ఆలయ భూమి వేలం పాట వాయిదా

నాయుడుపేట టౌన్, జూలై 13 : శ్రీకాళహస్తీశ్వర, వేణుగోపాలస్వామి ఆలయ భూమికి శనివారం వేలం పాట నిర్వహించారు. నాయుడు పేట-శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపాన ఆలయాలకు సంబంధించిన కాంప్లెక్స్ వెనుక 60 సెంట్ల భూమికి దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విన్నమాల ఆలయ ప్రాంగణంలో వేలం నిర్వహించారు. గతేడాది పాడిన వ్యక్తి నగదు చెల్లించకపోవడంతో పాట నిర్వహించాల్సి వచ్చిందని ఈవో జనార్దన్‌రెడ్డి తెలిపారు. అయితే గత ఏడాదివచ్చిన హెచ్‌పాట రాకపోవడంతో వాయిదా వేసినట్లు తెలిపారు.



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

లక్ష్మీనరసింహస్వామికి పూజలు

చిల్లకూరు, జూలై 13: కలవకొండలోని లక్ష్మీనరసింహస్వామికి శనివారం పూజలు జరిగాయి. ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పల్లకి సేవ జరిపారు. అనంతరం ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్లను ఊరేగించారు. భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రసన్న వెంకటేశ్వరుడికి అభిషేకాలు

కోట, జూలై 13 : నెల్లూరుపల్లి కొత్తపాళెం, గోవిందపల్లి, చిట్టేడు, శ్రీలక్ష్మమ్మ కాలనీల్లోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు అభిషేకాలు చేశారు. విశేష అలంకరణ చేశారు. శ్రీలక్ష్మమ్మకాలనీలో ఆలయ ప్రధానార్చకులు సాయిబాబా ఆధ్వర్యంలో దాతల సహకారంతో భక్తులకు అన్నదానం జరిగింది. భక్తులు విశేష పూజలు చేశారు.



గూడూరు కుటుంబాన్ని కలిసిన చిదానందస్వామి

నాయుడుపేట, జూలై 13 : కర్ణాటకకు చెందిన శక్తి సంప్రదాయ కలికి ఆశ్రమం నుంచి చిదానందస్వామి విజయవాడకు వెళ్తూ మార్గ మధ్యలో నాయుడుపేటలోని గూడూరు కుటుంబ సభ్యులను శనివారం కలిశారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దివంగత గూడూరు రఘునాథరెడ్డి భార్య, నాయుడుపేట మాజీ సర్పంచ్ ప్రభావతమ్మను మర్యాదపూర్వకంగా కలిశారు. కలికి స్వాముల చిత్రపటాన్ని అందజేశారు. తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు అవధానం సుధీర్, సాహిత్య, జేయకృష్ణలు ఉన్నారు.



ప్రభావతమ్మకు చిత్రపటాన్ని అందజేస్తున్న చిదానందస్వామి

పంచాయతీలకు విధుల విడుదలపై హర్షం

పెళ్లకూరు, జూలై 13: ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘ నిధులు విడుదల చేయడంపవై సర్పంచుల సంఘ రాష్ట్ర కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్ర ప్రసాద్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సంఘ నిధులను గత వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిందన్నారు. దీంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పంచాయితీలకు నేరుగా నిధులు మంజూరు చేయడంతో గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు అవకాశమేర్పడిందన్నారు.

ఫ్యాన్సీ షాపులో భారీ అగ్నిప్రమాదం

షార్ట్‌సర్క్యూట్‌తో దుకాణం దగ్ధం ● రూ.కోటి మేర ఆస్తినష్టం

గూడూరు, జూలై 13: గూడూరు కుమ్మరవీధిలోని సూర్య ఫ్యాన్సీ, గిఫ్ట్ దుకాణంలో శనివారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించి దుకాణం గ్రౌండ్‌ఫ్లోర్‌తో పాటు మూడు అంతస్తుల్లోని సామగ్రి అగ్నికి ఆహుతైంది. మంటల సెగకు భవనం పగుళ్లిచ్చింది. ఉదయం 5:30 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు అగ్నిమాపక సిబ్బంది శ్రమించి మంటలను అదుపు చేశారు. గూడూరు,కోట, నాయుడుపేటలకు చెందిన మూడు ఫైర్‌ఇంజన్లను వినియోగించారు. రూ.కోటి మేర ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా. దట్టమైన పొగలతో స్థానికులు భయాందోళన చెందారు. డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, సీఐ పాపారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మంటలు అదుపులోకి వచ్చేవరకు ఆ మార్గంలో రాకపోకలను నిలిపివేశారు. వ్యాపార సంస్థల ప్రాంతం కావడంతో దుకాణదారులు ఆందోళనలు చెందారు. అగ్నిమాపకశాఖ ఇన్‌చార్జి అధికారి విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగిందని భావిస్తున్నామన్నారు. రూ.కోటి మేర ఆస్తి నష్టం జరిగినట్లు దుకాణ యజమాని తెలిపారన్నారు. అగ్నిప్రమాదంపై ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ విచారం వ్యక్తంచేశారు. దుకాణాన్ని పరిశీలించి యజమాని వేణుగోపాల్‌తో ఆయన మాట్లాడారు. నిబంధనల మేరకు ప్రభుత్వం నుంచి సాయం అందించేందుకు కృషిచేస్తానన్నారు. గూడూరులో మరో ఫైరింజన్‌ను ఏర్పాటు చేయిస్తామన్నారు. దుకాణాలకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని వ్యాపారస్తులకు సూచించారు.





దుకాణంలో ఎగిసిపడుతున్న మంటలు - దుకాణం నుంచి వస్తున్న పొగలు

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

తడ, జూలై 13 : తమ కుమార్తె కనబడటం లేదని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు. అనంతపురం జిల్లా గుంతకల్‌కు చెందిన ఓ యువతి కొద్ది నెలల క్రితం శ్రీసిటీలోని డైకిన్ పరిశ్రమలో చేరింది. కొండూరు హాస్టల్‌లో ఉంటోంది. ఈ క్రమంలో బీహార్‌కు చెందిన యువకుడితో సన్నిహితంగా మెలుగుతుందని సమాచారం. ఈ నెల 3 నుంచి ఫోన్ చేయకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెంది శుక్రవారం తడ వచ్చి విచారించారు. గత నెల 18 నుంచి తమ కుమార్తె విధులకు హాజరుకావడం లేదని తెలుసుకుని వారు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చినుకు పడితే ఈ రహదారిలో రాకపోకలు కష్టమే



అధ్వానంగా శ్రీకాళహస్తి పాత జీఎన్‌టీ రోడ్డు

నాయుడుపేట, జూలై 13 : కొద్దిపాటి చినుకులకే శ్రీకాళహస్తి పాత జీఎన్‌టీ రోడ్డు చిన్నపాటి నీటి మడుగులా తయారవుతుంది. ఈ రహదారి నాయుడుపేట నడిబొడ్డున ఉండటంతో స్థానికులే కాకుండా పరిసర ప్రాంత ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అంతేకాక మేనకూరు సెజ్‌కు వెళ్లేందుకు ఇదే రహదారి. దీంతో పెద్ద సంఖ్యలో వాహనాలు వస్తూపోతు ఉంటాయి. ప్రాధాన్యత కలిగిన ఈ ప్రధాన రహదారి అధ్వానంగా ఉన్నా, ప్రజలు అవస్థలు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

కార్యాలయాలకు పాముల బెడద

కోట, జూలై 13 : కోటలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయానికి వెళ్లాలంటే ప్రజలు హడలిపోతున్నారు. ఈ ఆవరణలో పాములు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. పగలు సైతం ఆయా విషసర్పాలు కార్యాలయాలలోకి రావడంతో ఉద్యోగులు భయాందోళన చెందుతున్నారు. వివిధ సమస్యలపై మండల పరిషత్, తహసీల్దారు, ఎంఈవో, వెలుగు కార్యాలయాలకు రావాలంటేనే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో విచ్చలవిడిగా పెరుగుతున్న పిచ్చి మొక్కలు ఇందుకు కారణమవుతున్నాయి. వీటిని తొలగించే ప్రయత్నం చేయడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

గురుకులాల్లో గ్యాస్ సమస్య

కోట, జూలై 13 : అంబేడ్కర్ గురుకులాలకు నెలల తరబడి వంట గ్యాస్ అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో భోజనాలు వండిపెట్టలేకపోతున్నామని వంట తయారీదారులు చెబుతున్నారు ఉమ్మడి నెల్లూరుజిల్లాలో 6 బాలుర, 4 బాలికల గురుకుల పాఠశాలలు, కళాశాలలున్నాయి. వీటికి సమీప గ్యాస్ ఏజెన్సీల ద్వారా నెలకు 60 సిలిండర్లను ప్రభుత్వ సరఫరాచేస్తుంది. గతేడాది సెప్టెంబరు నుంచి ఇప్పటి వరకు బిల్లులు చెల్లించలేదని గ్యాస్ ఏజెన్సీలు సిలిండర్ల సరఫరాను నిలిపివేసినట్లు సమాచారం. కోట, వాకాడు, చిల్లకూరు, తదితర మండలాల గురుకులాల ప్రిన్సిపాళ్లు సొంత నిధులతో సిలిండర్లు తెప్పిస్తున్నారు. అదనపు భారాన్ని మోయలేమంటూ వీరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు జోక్యం చేసుకుని సమస్య పరిష్కరించాలని పాఠశాల వర్గాలు కోరుతున్నాయి.

ఐఐటీ పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయండి

ఏర్పేడు, జూలై 13: ఏర్పేడు వద్ద ఉన్న తిరుపతి ఐఐటీలో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. శనివారం ఆయన జేసీ ధ్యానచంద్రతో కలిసి ఐఐటీని సందర్శించారు. పెండింగ్ పనుల వివరాలు తెలుసుకున్నారు. డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ ఐఐటీ క్యాంపస్ పురోగతి గురించి వివరించారు. భూ సంబంధిత, ఇతర సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. సమావేశంలో ఐఐటీ రిజిస్ట్రార్ చమన్‌మెహతా, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఐఐటీ డైరెక్టర్‌తో సమీక్షిస్తున్న కలెక్టర్

విమానాశ్రయ సమస్యలపై సమీక్ష

రేణిగుంట, జూలై 13: రేణిగుంట విమానాశ్రయానికి సంబంధించి పలు అంశాలపై కలెక్టర్ వెంకటేశ్వర్ సమీక్షించారు. శనివారం అయన జేసీ ధ్యానచంద్రతో కలిసి విమానాశ్రయాన్ని సందర్శించారు. భూ సమస్యలు, ఎలక్ట్రిక్ లైన్ తదితర అంశాలపై ఎయిర్‌పోర్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, ట్రాన్స్‌కో అధికారులతో చర్చించారు. పరిష్కార దిశగా పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో పెంచల కిషోర్, ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, కేఈఐ సంస్థ ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మంగళంపాడులో విస్తృతంగా పారిశుధ్య పనులు

సూళ్లూరుపేట, జూలై 13: మంగళంపాడులో సర్పంచ్ రుక్మిణి ఆధ్వర్యంలో శనివారం విస్తృతంగా పారిశుధ్య పనులు చేపట్టారు. రోడ్లపై నిలిచిన వర్షపు నీటిని జేసీబీ సాయంతో పక్కనే కాలువ తవ్వి బయటకు పంపిచారు. మురుగు కాలువల్లో వ్యర్థాలు చేరి దుర్వాసన వెదజల్లుతోంది. సర్పంచ్‌తో పాటు గ్రామంలో టీడీపీ నాయకులు ఏలిబేటి సతీష్ తదితరులు వ్యర్థాలను తొలిగించి మురుగునీరు నిలవకుండా పనులు చేపట్టారు. వీధుల్లో బ్లీచింగ్ చల్లి పారిశుధ్య పనులు మెరుగుపరిచారు.

వైభవంగా సాగిన జగన్నాథ రథయాత్ర





గూడూరులో జగన్నాథుడి రథయాత్ర- రథయాత్రలో పాల్గొన్న భక్తులు

గూడూరు, జూలై 13: పట్టణంలో అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంఘం(ఇస్కాన్) ఆధ్వర్యంలో శనివారం వైభవంగా జగన్నాథ రథయాత్ర నిర్వహించారు. సాయంత్రం సొసైటీ కాలనీలోని నారాయణమ్మ గుడి వద్ద పూజలు నిర్వహించి రథయాత్ర ప్రారంభించారు. రథాన్ని లాగేందుకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. రథయాత్ర ముందు కోలాటాలు ఆడుతూ, భజనలు, నృత్యాలు చేస్తూ, కీర్తనలు పాడుతూ ఉత్సాహంగా ముందుకు సాగారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. రథయాత్ర సాగే రోడ్లపై భక్తులు రంగవల్లులను తీర్చిదిద్దారు. స్థానిక నారాయణమ్మ గుడి నుంచి ఐసీఎస్‌రోడ్డు, కోనేటిమిట్ట, సంగం థియేటర్, గాంధీబొమ్మ, టవర్‌క్లాక్, రాజావీధి, కుమ్మరవీధి మీదుగా రథయాత్ర సాగింది. డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలుకు చేరుకుని ముగిసింది. పలు కూడళ్లల్లో స్వచ్ఛంద సంస్థలు, భక్తులకు ప్రసాదాలు, మంచినీళ్ల, మజ్జిగ ప్యాకెట్లను అందజేశాయి. భక్తుల కోలాహలం నడుమ జగన్నాథ రథయాత్ర కన్నులపండువగా సాగింది.

అనారోగ్యంతో గురుకుల విద్యార్థిని మృతి

● సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని ఎమ్మార్పీఎస్ నాయకుల ఫిర్యాదు



షరీనా (ఫైల్‌ఫోటో)

డక్కిలి, జూలై 13 : జ్వరం బారిన పడిన ఓ విద్యార్థిని చెన్నై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. గురుకుల పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యమే ఇందుకు కారణమని స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులు వాసుదేవరావు, సురేష్, మణి, రవి, గద్దల మునెయ్య, సర్వేపల్లి రత్నయ్యలు ఆరోపించారు. పోలీసులకు ఫిర్యాదుచేశామన్నారు. శనివారం వారు మీడియాతో మాట్లాడారు. గురుకుల పాఠశాలలో 5వ తరగతి విద్యార్థిని షరీనా(9) కొద్దిరోజులుగా జ్వరంతో బాధపడుతోందన్నారు. కానీ పాఠశాల సిబ్బంది ఈ విషయం తల్లిదండ్రులకు చెప్పలేదన్నారు. ఆరోగ్యం విషమించడంతో ఈ నెల 12వ రాపూరులోని తల్లిదండ్రులు సమాచారమిచ్చి చేతులు దులుపుకొన్నారన్నారు. పది రోజులుగా అనారోగ్యంతో బాధపడటం వల్ల విద్యార్థిని శరీర అవయవాలు దెబ్బతిన్నాయని చెన్నై వైద్యులు చెప్పారన్నారు. ఇందుకు బాధ్యులైన పాఠశాల నర్సు, పీఈటీ టీచరు, హౌస్ టీచర్లతో పాటు ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదుచేశామన్నారు. ఎమ్మెల్యే రామకృష్ణ చొరవ తీసుకొని బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని వారు కోరారు.

రెవెన్యూ అధికారులు విచారణ

విద్యార్థి మృతి సంఘటనపై రెవెన్యూ అధికారులు శనివారం విచారణ చేపట్టారు. ఆహార పదార్థాలు, తాగునీటి నాణ్యత వంటి అంశాలపై లోతుగా పరిశీలిచంచారు. ఉన్నతాధికారులకు వారు నివేదిక పంపనున్నారు. ఈ సంఘటనతో వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. పాఠశాల్లో నీటినమూనాలు, పరిసరాల పరిశుభ్రతపై దృష్టి పెట్టింది. ఈవోపీఆర్డీ శనివారం పాఠశాల పరిసరాల్లో బ్లీచింగ్ చల్లించారు. షరీనా మృతిపై ఉన్నతాధికారులు విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం సునీల్ డిమాండ్ చేశారు.



ఫిర్యాదుచేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గురుకులంలో నీటి సమస్య రానివ్వం: విజయశ్రీ

సూళ్లూరుపేట, జూలై 13: స్థానిక అంబేడ్కర్ గురుకులంలో తాగునీటి ఇబ్బంది రానికుండా ప్రత్యేక చొరవ తీసుకొంటామని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్ దాతృత్వంతో గురుకులం విద్యార్థులకు ఏర్పాటు చేసిన నీటి ట్యాంకర్లను టీడీపీ నాయకులతో కలిసి శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను సమస్యలడిగి తెలుసుకొన్నారు. ప్రిన్సిపాల్ గురుప్రసూన గురుకులంకు ఉన్న బోర్‌పాయింట్‌లు భూగర్భ జలాలు అడుగంటడంతో పనిచేయడం లేదని వివరించారు. ఎమ్మెల్యే స్పందించి నేత కొండేపాటి గంగాప్రసాద్ ద్వారా రెండు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తామన్నారు. ఇంకా అవసరమైతే మున్సిపాలిటీ ద్వారా ట్యాంకర్లతో సరఫరా చేస్తామన్నారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శిలు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, తెలుగు యువత ఉపాధ్యక్షుడు మాధవనాయుడు, టీడీపీ నాయకులు వాకచర్ల రమేష్, అలవల శ్రీనివాసులు, కుదిరి పెంచలయ్య, బుజ్జిబాబు, ఆలీబాయ్, శశిధర్, రాజసులోచనమ్మ, దొరైబాబు పాల్గొన్నారు.



నీటి ట్యాంకర్ ద్వారా నీటి అందిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

పొలంగట్టుపై ఆకులను తాళింపుగా చేసుకుని...

ఆహారం వికటించడంతో నలుగురికి అస్వస్థత

శ్రీకాళహస్తి, జూలై 13: పొలం గట్టుపై కనిపించిన ఆకును తోటకూరగా భావించారు. ఆపై ఇంటికి తెచ్చి తాళింపుగా చేసుకుని సభ్యులంతా తిన్నారు. ఆహారం విషపూరితమై వికటించడంతో నలుగురు మహిళలు తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన శ్రీకాళహస్తి పట్టణంలోని వీఎంపల్లెలో శనివారం చోటు చేసుకుంది. వీఎంపల్లెకు చెందిన రమణమ్మ(55), నిర్మల(50), శ్యామల(25), అమ్ములు(35) ఒకే కుటుంబ సభ్యులు. వీరంతా కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తుంటారు. శనివారం కాలనీ సమీపంలోని పొలంగట్టుపై తోటాకు తరహాలో ఆకు కనిపించింది. దానిని సేకరించుకుని ఇంటికి వచ్చి తాళింపు చేసుకుని అన్నంతో కలిసి తిన్నారు. సాయంత్రానికి నలుగురూ మతిస్థితిమితం కోల్పోయిన వారిలా ప్రవర్తించారు. ఇరుగుపొరుగు వారు గమనించి శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి అదుపు కాకపోవడంతో మెరుగైన వైద్యం కోసం వారిని తిరుపతి రుయాకు రెఫర్ చేశారు.

ఎన్‌ఆర్‌ఐ కిడ్నాప్ కేసులో 8మంది అరెస్టు

శ్రీకాళహస్తి, జూలై 13: ఎన్‌ఆర్‌ఐ కిడ్నాప్ కేసులో ఒక యువతి సహా మరో ఏడుగురు యువకులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శ్రీకాళహస్తి టూటౌన్ సీఐ రారాజు కథనం మేరకు... తిరుపతికి చెందిన కృష్ణమూర్తి ఎన్‌ఆర్‌ఐ. ప్రైవేటు సంస్థలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న ఆయనకు తిరుపతికి చెందిన ఆయేషా అనే యువతితో పరిచయం ఏర్పడింది. కొందరు మహిళలను సభ్యులుగా చేర్పిస్తామని ఆయేషా చెప్పడంతో కృష్ణమూర్తి ఆమెతో పాటు ఈనెల 3వ తేదీన శ్రీకాళహస్తి పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు వెళ్లారు. అక్కడ ఆయేషా, మరి కొందరు యువకులతో కలిసి కృష్ణమూర్తి కంట్లో కారం కొట్టి కారులో ఎక్కించుకుని కిడ్నాప్ చేశారు. అతని వద్ద నుంచి రూ.5లక్షల నగదు వసూలు చేశారు. కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు, స్నేహితులకు ఫోన్ చేసి రూ.6కోట్లు డిమాండ్ చేశారు. డబ్బు రాకపోవడంతో మరుసటిరోజు 4వ తేదీన కృష్ణమూర్తిని రాజీవ్‌నగర్‌లో వదలి వెళ్లిపోయారు. 8వ తేదీన కృష్ణమూర్తి శ్రీకాళహస్తి టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ రారాజు ఆధ్వర్యంలో పోలీసులు విచారణ చేపట్టారు. ఆయేషానే కిడ్నాప్ పథకం రచించినట్లుగా నిర్ధారించుకుని ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇందులో భాగస్వాములు అయిన న్యామత్, రామచంద్రారెడ్డి, వడ్డపూడి దాము, బంజల లోకేష్, పిడతల గిరి, యాసారపు భార్గవ్, వెట్టి అనిల్ అనే యువకులను శనివారం అరెస్టు చేశారు. ఆయేషా పాటు మొత్తం 8మంది నిందితులను రిమాండ్‌కు తరిలించనట్లు సీఐ రారాజు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి స్వాగతం



రేణిగుంట, జూలై 13: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్‌కు శనివారం రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. శ్రీవారి దర్శనార్థం విమానాశ్రయం చేరుకున్న ఆయనకు కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, నగరపాలక సంస్థ కమిషర్ అదితిసింగ్, డీఆర్వో పెంచల కిషోర్, ప్రోటోకాల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రబాబునాయుడు, ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్, ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి తదితరులు స్వాగతం పలికారు. అనంతరం నీరబ్‌కుమార్ ప్రసాద్ రోడ్డు మార్గాన శ్రీవారి దర్శనార్థం తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

ప్రమాదకర మలుపులతో భయాందోళన

చిల్లకూరు, జూలై 13: మండలంలోని పలు గ్రామాల్లో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో ఆయా గ్రామాల మీదుగా ప్రయాణాలు సాగించే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ప్రధానంగా చిల్లకూరు, ఏరూరు, పారిచెర్లవారిపాళెం, చేడిమాల, తిక్కవరం, చింతవరం, బల్లవోలు, మోమిడి, వరగలి తదితర గ్రామాల్లో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. చిల్లకూరులో సచివాలయం, దళితవాడలకు సమీపంలో రెండు చోట్ల క్లిష్టమైన మలుపులు ఉన్నాయి. దళితవాడ సమీపంలో ఉన్న మలుపు వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు, మద్యం దుకాణం ఉంది. సచివాలయం సమీపంలోని మలుపు వద్ద రద్దీగా కూడా ఉంటుంది. దీంతో ఆయా మలుపుల వద్ద తరచూ ప్రమాదలు జరుగుతుంటాయి. గతంలో దళితవాడలోని మలుపు వద్ద ఆటో బోల్తాపడి పలువురు గాయపడ్డారు. రోజూ ఏదో ఒక సమయంలో ద్విచక్రవాహనం బోల్తా పడి వాహనచోదకులు గాయపడుతుంటారు. సచివాలయ మలుపు వద్ద కూడా ఇదే పరిస్థితి. నల్లయ్యగారిపాళెం సమీపంలో గతంలో ట్రాక్టర్ బోల్తాపడి పలువురుకి గాయాలయ్యాయి. పారిచెర్లవారిపాళెం, ఏరూరు, చేడిమాల, మోమిడి, వరగలి గ్రామాల్లో కూడా మలుపు వద్ద పలుమార్లు బైక్‌లు బోల్తాపడ్డాయి. అధికారులు స్పందించి మలుపుల వద్ద సూచికబోర్డులు, వేగనిరోధకాలు ఏర్పాటు చేయాల్సి ఉంది.





చిల్లకూరు-ఏరూరుల్లో ఇబ్బంది కలిగిస్తున్న మలుపులు